www.udyamakeratam.com

RNI: TGTEL/25/A0273

1 వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షితః

UDYAMA KERATAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 46 | 24-7-2026 | శుక్రవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



# గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ




## గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి

- పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- గ్లోబరీనా తప్పిదాలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి
- ధర్మేంద్ర రాజీనామాను బిఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయదు
- బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే
- సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ, ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- ఓటు లేకపోతే పథకాలు పోతాయని హెచ్చరిక
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

2

ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల మూల్యాంకనంలో అక్రమాలకు పాల్పడిన 'గ్లోబరీనా' ముమ్మాటికీ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బినామీ సంస్థేనని సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో సీఎం మాట్లాడారు. ఆనాడు గ్లోబరీనా సంస్థ చేసిన తీవ్రమైన తప్పిదాల వల్లే 27 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని, అదే సంస్థ పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. ఈ తప్పిదాలకు గాను కేటీఆర్ తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ లీకేజీ వ్యవహారంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయడం లేదని ప్రశ్నిస్తూ, బీఆర్ఎస్ మరియు బీజేపీ రెండూ ఒక్కటేనని సీఎం ఆరోపించారు. - ఉద్యమ కెరటం, హైదరాబాద్

## గ్లోబరీనాతో కేటీఆర్‌కు ప్రత్యక్ష సంబంధాలు

## గ్లోబరీనా సంస్థతో నాకు సంబంధం లేదు



వివరాలు 2లో..

- క్షమాపణలు చెప్పకుంటే లీగల్ చర్యలు
- రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ హెచ్చరిక

# పేపర్ లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

- యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడేవారిని వదిలిపెట్టం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన
- మోదీ ప్రకటనపై రాహుల్, సీజేపీ స్పందన

2



## విద్యార్థులతో చర్చలకు మేము సిద్ధం



- ఎప్పుడైనా.. ఎక్కడైనా మాట్లాడుకుందాం
- కేంద్రమంత్రి జితేంద్ర సింగ్
- సీజేపీ నేతలకు ఆహ్వానం
- జితేంద్ర సింగ్, జేపీ నడ్డాతో చర్చలకు ప్రతిపాదన

2

## డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య



- సర్వీస్ తుపాకీతో కాల్చుకున్నట్లు గుర్తింపు
- సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసుల దర్యాప్తు

2

## తెలంగాణ గుండెకాయ సింగరేణి

- భవిష్యత్ తరాలకు లాభాల బాటలో అందించాలి
- ప్రైవేట్ పోటీని తట్టుకునేలా ఉత్పత్తి వ్యయం తగ్గించాలి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సత్తుపల్లి ఓపెన్‌కాస్ట్ గనిలో క్షేత్రస్థాయి పరిశీలన
- సౌరశక్తి, కీలక ఖనిజాల రంగంలోనూ సింగరేణి విస్తరించాలి



వివరాలు 2లో..

## గత లీకేజీలకు కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా?

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు
- టెన్త్ లీకేజీలో రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు
- కేంద్రమంత్రి మంత్రి కిషన్ రెడ్డి

జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

3



## త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి

- ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తాం: క. కేశవరావు
- 16 రోజులుగా వివిధ సంఘాలతో విస్తృత సంప్రదింపులు

3



## ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

- లేకుంటే మీరే తొలగి పోవాల్సి వస్తుంది
- ప్రధాని మోడీకి అభిజిత్ దీప్కే హెచ్చరిక

2




## నేడు దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ పిలుపు



- నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్
- శాంతియుత ఆందోళనలకే పరిమితం కావాలని యువతకు సూచన
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ప్రకటన మధ్య మరో ఉద్యమానికి సిద్ధమైన సీజేపీ

4

## ఢిల్లీలో మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు అసంతృప్తి




4

సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రతిపక్షాల పట్టు

- నీట్ అంశంపై దుమారం..
- నేటికి లోక్‌సభ వాయిదా
- రాజీనామా తర్వాతే చర్చ అంటున్న ప్రతిపక్షాలు

4



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
24 జూలై 2026

# గ్లోబరీనా సంస్థతో నాకు సంబంధం లేదు

## క్షమాపణలు చెప్పకుంటే లీగల్ చర్యలు

## రేవంత్ వ్యాఖ్యలపై కేటీఆర్ హెచ్చరిక



**హైదరాబాద్, జూలై 23:** 2019 ఇంటర్ ఫలితాల్లో కేటీఆర్ బినామి సంస్థ గ్లోబరీనా అవకతవకలకు పాల్పడిందని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండి పడ్డారు. ముఖ్యమంత్రి హోదాకు తగిన విధంగా ఒక్కసారైనా వ్యవహరించాలని సూచించారు. పేపర్ లీక్ వంటి అత్యంత దురదృష్టకర ఘటనను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తూ తప్పుడు ప్రచారం చేయడం ముఖ్యమంత్రి పదవికే మచ్చ తెచ్చే చర్య అని ఆయన ఆరోపించారు. గ్లోబరీనా సంస్థతో బీఆర్ఎస్‌కు, తన కుటుంబానికి లేదా తనకు ఎలాంటి సంబంధం లేదని కేటీఆర్ మరోసారి స్పష్టం చేశారు. ఈ విషయంలో చేసిన ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనికి సంబంధించి తమ న్యాయ బృందం త్వరలోనే ముఖ్యమంత్రికి లీగల్ నోటీసు పంపనున్నట్లు వెల్లడించారు. అలాగే, ముఖ్యమంత్రి తరచూ తనపై అసభ్యకరమైన, ఆధారరహిత ఆరోపణలు చేస్తున్నప్పటికీ వాటికి తాను ఎక్కువగా స్పందించలేదని కేటీఆర్ పేర్కొన్నారు. తన మౌనం ఆరోపణలను అంగీకరించినట్లు కాదని, నిరాధార విమర్శల స్థాయికి దిగజారి వాదించడం తనకు ఇష్టం లేదని వ్యాఖ్యానించారు.

# గ్లోబరీనాతో కేటీఆర్‌కు ప్రత్యక్ష సంబంధాలు

## ఆ సంస్థ నిర్మించిన ఫామ్‌హౌజ్‌లోనే కేటీఆర్ మకాం

## కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆరోపణ



**హైదరాబాద్, జులై 23:** సిఓ ఇఎంటి సంస్థ తెలంగాణలోనే పుట్టిందని, ఆ సంస్థతో కేటీఆర్‌కు సంబంధాలున్నాయని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ ఆరోపించారు. ఆ సంస్థ నిర్మించిన ఫామ్‌హౌస్‌లోనే కేటీఆర్ ఉంటున్నారని, సంస్థకు సంబంధించిన భూములు కూడా ఆయన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే 2019లో ఇంటర్ పరీక్షల నిర్వహణకు గ్లోబరీనా సంస్థకు అక్రమంగా టెండర్లు కేటాయించారని, ఆ సంస్థపై జేఎన్‌టీయూ హైదరాబాద్, జేఎన్‌టీయూ కాకినాడలో కేసులు నమోదైనా చర్యలు తీసుకోలేదన్నారు. 26 మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వ్యవస్థపై అప్పటి ప్రభుత్వం స్పందించలేదని, దీనిపై కేటీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్ తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థుల సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు కేటీఆర్‌కు లేదని, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ధర్నా చేస్తున్న విద్యార్థులపై జరిగిన దాడిని బీఆర్ఎస్ ఖండించలేదని, బీజేపీని ప్రశ్నించే ధైర్యం కూడా ఆ పార్టీకి లేదని అన్నారు. అలాంటి పరిస్థితుల్లో కేటీఆర్ మహాధర్నా చేపట్టడం సిగ్గుచేటని విమర్శించారు. శాంతియుతంగా నిరసనలు చేపడితే ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించదని, కానీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే మాత్రం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొత్త పేరుతో మరో సంస్థను ఏర్పాటు చేసి సీబీఎస్ఈతో కూడా వ్యవహరిస్తోందని బల్మూర్ వెంకట్ ఆరోపించారు. ఇప్పుడు విద్యార్థుల కోసం పోరాడుతున్నట్లు కేటీఆర్ మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కూడా కేటీఆర్ ప్రమేయంపై అనుమానాలు ఉన్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో పేపర్ లీకేజీలు ఎక్కువగా జరిగాయని విమర్శించారు. ఇదిలా ఉంటే.. కేటీఆర్ బర్త్‌డే వేడుకలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు బల్మూర్ వెంకట్. కేటీఆర్ తన పుట్టిన రోజు కోసం పదిరోజుల ముందే దుబాయ్ వెళ్లారని, అక్కడ సినీ పరిశ్రమకు చెందిన కొందరితో కలిసి బర్త్‌డే పార్టీ జరుపుకున్నారని అన్నారు. దుబాయ్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత మూడు రోజుల పాటు పూర్తిగా రెస్ట్ మోడ్‌లో ఉన్నారని, ఆ తర్వాత ఒక్కసారిగా విద్యార్థుల ధర్నా పేరుతో డ్రామా ప్రారంభించారని బల్మూరి వెంకట్ విమర్శించారు. విద్యార్థుల సమస్యలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని ఆయన సూచించారు.

# డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ ఆత్మహత్య

**హైదరాబాద్, జూలై 23:** నగరంలో కానిస్టేబుల్ ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో కానిస్టేబుల్ స్వామి తన సర్వీస్ తుపాకీతో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. గురువారం తెల్లవారుజామున 5:30 గంటల ప్రాంతంలో వాష్‌రూమ్‌లో స్వామి ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. స్వామి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఘటనా స్థలిలో కానిస్టేబుల్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 'ఏదైనా తప్పు చేసి ఉంటే నేను మాత్రమే చేశాను. నా భార్య, పిల్లలు ఏ తప్పూ చేయలేదు. నా భార్య, పిల్లల్ని ఏమీ అనొద్దు. వాళ్లు మంచివాళ్లు. నేను చనిపోయిన తర్వాత ఎవరైనా నా భార్యను పిల్లల్ని వేధించినా, హింసించినా దెయ్యమై వదిలిపెట్టను. ఎందుకంటే వాళ్లు అంటే నాకు చాలా ఇష్టం. అమ్మని, అక్కని జాగ్రత్తగా చూసుకో' అంటూ కొడుకుకు సూచిస్తూ డైరీలో స్వామి సూసైడ్ నోట్ రాశారు. కానిస్టేబుల్ బలవన్మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్వామి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కానిస్టేబుల్ మృతదేహాన్ని డీజీపీ కార్యాలయం నుంచి ఉస్మానియా మార్చురీకి తరలించారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ అధికారులు అక్కడకు చేరుకుని ఆధారాలను సేకరించే పనిలో ఉన్నారు. కానిస్టేబుల్ స్వామి రాసిన సూసైడ్ నోట్‌పై అధికారులు దర్యాప్తు చేపట్టారు. అయితే స్వామి సూసైడ్‌కు బెట్టింగ్ కారణమని ఉన్నతాధికారులు అనుమానిస్తున్నారు. విషయం తెలిసిన వెంటనే స్వామి కుటుంబసభ్యులు డీజీపీ కార్యాలయానికి చేరుకున్నారు.

# గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ

- గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది బలి
- పేరు మార్చుకుని పరీక్షల కాంట్రాక్ట్ పొందింది
- గ్లోబరీనా తప్పిదాలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి
- బీఆర్ఎస్, బీజేపీ రెండూ ఒక్కటే
- సర్ ప్రక్రియలో ఎస్సీఎస్టీ, ఓట్లు తొలగించే కుట్ర
- అందుకే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాం
- ఓటు లేకపోతే పథకాలు పోతాయని హెచ్చరిక
- మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జులై 23:** గ్లోబరీనా ముమ్మాటికీ కేటీఆర్ బినామీ సంస్థ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు ఆరోపించారు. గురువారం మీడియాతో నిర్వహించి చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గ్లోబరీనా తప్పిదాల వల్ల 27 మంది చనిపోయారని.. ఆ సంస్థ పేరు మార్చుకొని పరీక్షల కాంట్రాక్టు పొందిందని వ్యాఖ్యానించారు. వీటి ఆధారంగానే నీట్ కుంభకోణం జరిగిందన్నారు. గ్లోబరీనా తప్పిదాలపై కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అమరవీరుల స్తూపం వద్ద కేటీఆర్ ముక్కు నేలకు రాయాలన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విషయంలో బీఆర్ఎస్ ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత కేటీఆర్, బీజేపీపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కేటీఆర్ బర్త్ డే పై సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ పుట్టిన రోజు దావత్ ఇస్తాడో అడగాలి. కేటీఆర్ ఇచ్చే దావత్ నేను తీసుకోలేనేమో. ఆయనవి అన్నీ వేరే పార్టీలు' అంటూ సెటైర్ విసిరారు. హరీశ్ గొప్పవాడైతే మంత్రి పదవి నుంచి ఎందుకు తీసేశారని ప్రశ్నించారు. అతి తెలివి తేటలతో ఏదిపడితే అది మాట్లాడతానంటే నడవదని హరీశ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు కన్నెపల్లి పంపు హౌజ్ గురించి మాట్లాడుతున్నారని.. మేడిగడ్డ గురించి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. మేడిగడ్డ గురించి మాట్లాడితే ప్రజలు చెప్పుతో కొడతారని మండిపడ్డారు. మేడిగడ్డ కట్టింది, కూల్చింది బీఆర్ఎస్ వాళ్లే అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ అయిపోయే వరకూ ఎమ్మెల్యేలను గ్రామాల్లోనే ఉండమని చెప్పానని ముఖ్యమంత్రి అన్నారు. సర్ నాయకులకు సంబంధించింది కాదని, ప్రజలకు సంబంధించిందని స్పష్టం చేశారు. 'తెలిసీ తెలియక నాకు రెండు ఓట్లు ఉన్నాయని అంటున్నారు. కలెక్టర్ అనుమతి తీసుకొని నా గ్రామంలో ఉన్న ఓటును కొడంగల్‌కు మార్చుకున్నాను. గతంలో కొడంగల్ ప్రాంతం కర్ణాటకలోని జిల్లాలో ఉండేది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు చేసినప్పుడు కొడంగల్ పాలమూరులోకి వచ్చిందని చెప్పారు. బీజేపీ కుట్రపూరితంగా ఓట్లను తొలగించే అవకాశముందని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. గ్రామీణ ప్రాంతంలో అమాయకుల ఓట్లు పోయే అవకాశముందన్నారు. సర్ ఉద్దేశం ప్రక్షాళన అని.. కుట్ర పూరితంగా సర్‌ను వాడుతున్నారని ఆరోపించారు. సర్ పట్ల జాగ్రత్తగా ఉండాల్సిందే అని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు పోతే.. కాంగ్రెస్ ఓట్లు పోయినట్టే అని అన్నారు. అవగాహన లేకపోవడం, సరైన సమయంలో స్పందించకపోవడం వల్ల ఓట్లు పోయే అవకాశముందన్నారు. 'ఓటుహక్కు లేకపోతే పథకాలు పోతాయి.. ఓటుహక్కు లేకపోతే ఆధార్ పోతుంది. ఓటుహక్కు లేకపోతే గుర్తింపే ఉండదు... ఓటుహక్కు లేకపోతే సంక్షేమం రాదు' అని అన్నారు. బీజేపీలో అంతర్గత కలహాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీ నాయకులకు ఒకరంటే ఒకరికి పడదన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లు ఎక్కడుంటాయో బీజేపీకి తెలుసని వెల్లడించారు. చిన్నచిన్న కారణాలతో ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లకు 5 లక్షలు ఇవ్వాలని డిసైడ్ అయిందని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు.. బ్రోకర్లకు అమ్ముకొని దళారీ వ్యవస్థ తెచ్చారని మండిపడ్డారు. 'మేం ఏం చేస్తున్నామో అదే చెప్తున్నాం' అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 70 శాతం ఎస్ఐఆర్ పూర్తయిందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రక్షాళన పేరుతో ఓట్లు తొలగించే అవకాశం ఉందని.. అలా జరగకుండా ఉండేందుకు బీఎల్‌వోలను పెట్టామన్నారు. ఓట్లు లేకుంటే ప్రభుత్వ పథకాలు ఎలా వస్తాయని సీఎం ప్రశ్నించారు. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న ఆంధ్ర ఓట్లన్నీ తొలగించారు. కాంగ్రెస్ పార్టీ కోర్టుకు వెళితే.. జీహెచ్‌ఎంసీ కమిషనర్‌పై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. హైడ్రా బాగా పనిచేస్తోంది.. చాలా ఆస్తులు స్వాధీనం చేసుకుంది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. ఆ ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినందుకే హరీశ్‌రావుకు కొన్నాళ్లు మంత్రి పదవి ఇవ్వకుండా కేసీఆర్ పక్కన పెట్టారు. గత ప్రభుత్వంలో ఇంటర్ పేపర్ల మూల్యాంకనంలో జరిగిన తప్పిదాలతో 27 మంది విద్యార్థులు బలయ్యారు. గ్లోబరీనా సంస్థ విషయంలో కేటీఆర్ నిజాయతీ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థుల మృతికి కారణమైన ఆయన క్షమాపణ చెప్పాలి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు బీఆర్ఎస్ ఎందుకు డిమాండ్ చేయలేదని అన్నారు. పేదలకు ఇచ్చే ఇళ్లను బీఆర్ఎస్ నేతలు దళారులకు అమ్ముకున్నారు. జన్వాడ ఫాంహౌస్ భూములపై కేటీఆర్ విచారణ కోరాలి. మేం అధికారంలోకి వచ్చాకే ఇందిరాపార్కు వద్ద ధర్నా చౌక్‌ను తిరిగి ఓపెన్ చేశాం. నాడు వాళ్లు మూసిన ధర్నా చౌక్‌లోనే కేటీఆర్ ధర్నా చేస్తామంటున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు.

# విద్యార్థులతో చర్చలకు సిద్ధం

## ఎప్పుడైనా.. ఎక్కడైనా మాట్లాడుకుందాం : కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కారం దిశగా అడుగులు వేస్తోంది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు ఎప్పుడైనా, తమకు అనుకూలమైన సమయంలో ప్రభుత్వంతో చర్చలకు రావచ్చని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఆహ్వానించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ, ఆందోళనకారుల తరఫున ప్రతినిధులు వచ్చి ప్రభుత్వంతో నేరుగా చర్చించాలని కోరారు. ప్రభుత్వం నాలుగు ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, వాటిపై సానుకూలంగా చర్చించేందుకు తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం తరఫున తాను, భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా చర్చల్లో పాల్గొంటామని జితేంద్ర సింగ్ వెల్లడించారు. జేపీ నడ్డా కార్యాలయంలోగానీ, ఆయన నివాసంలోగానీ సమావేశం నిర్వహించేందుకు అభ్యంతరం లేదని, విద్యార్థులకు అనువైన సమయం, ప్రదేశాన్ని ఎంపిక చేసుకోవచ్చని పేర్కొన్నారు. ముందుగా చర్చలు ప్రారంభిస్తే సమస్య పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని, విద్యార్థుల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వానికి ప్రాధాన్యమని జితేంద్ర సింగ్ అన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి

## లేకుంటే మీరే తొలగి పోవాల్సి వస్తుంది : ప్రధాని మోడీకి అభిజిత్ దీప్కే హెచ్చరిక



**న్యూఢిల్లీ,జూలై23:** కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని ప్రధాని మోదీని కాక్రోచ్ జనతా పార్టీ ప్రెసిడెంట్ అభిజీత్ దీప్కే గురువారం మరోసారి కోరారు. కేంద్రం స్పందించని పక్షంలో ఈ రాజీనామాల పర్వం ప్రధాని మోదీ వరకూ చేరుతుందని వ్యాఖ్యానించారు. 'మోదీ జీ.. మిమ్మల్ని మరోసారి అభ్యర్థిస్తున్నా.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను ఆమోదించండి. లేకపోతే ఇది ఆయన రాజీనామాకే పరిమితం కాదు. మీ రాజీనామా వరకూ వస్తుంది' అని అన్నారు. ధర్మేంద్ర ప్రధాన్‌కు కేంద్రం ఇంకా ఎందుకు అండగా ఉంటోందని అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. 'దేశంలోని కోట్ల మంది విద్యార్థుల కంటే ఒక విఫల, అసమర్థ మంత్రి ఎక్కువ కాదు కదా? ఒక వేళ మంత్రే ముఖ్యమని భావిస్తే దేశంలో మీకెవరూ ఓటు వేయబోరన్న విషయాన్ని మర్చిపోవద్దు' అని అన్నారు. నీట్ పేపర్ లీక్‌పై చర్చకు కేంద్రం మరోసారి ఆహ్వానించగా సీజేపీ తిరస్కరించిన విషయం తెలిసిందే. ఎలాంటి చర్చైనా జంతర్‌మంతర్ వద్ద లేదా మరో తటస్థ వేదికపై జరగాలని సీజేపీ స్పష్టం చేసింది. ఇక ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామన్న ప్రధాని ప్రకటనపై కూడా సీజేపీ ప్రతినిధి స్పందించారు. ఇలాంటి ప్రకటనలతో ఏ ప్రయోజనం ఉండదని అన్నారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మినహా తాము మరొకటి ఆశించట్లేదని స్పష్టం చేశారు.

# పేపర్ లీక్ కేసులకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు

## యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడేవారిని వదిలిపెట్టం

## ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన

## మోదీ ప్రకటనపై రాహుల్, సీజేపీ స్పందన

**న్యూఢిల్లీ, జూలై 24:** నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై దేశవ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. ప్రశ్నాపత్రాల లీకేజీ కేసుల్లో బాధ్యులపై త్వరితగతిన విచారణ పూర్తి చేసి కఠిన శిక్షలు విధించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించిన ప్రధాని, యువత భవిష్యత్తుతో చెలగాటం ఆడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, పేపర్ లీక్ కేసుల విచారణ వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

### మోదీ ప్రకటనపై రాహుల్ స్పందన

ప్రధాని ప్రకటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ స్పందించారు. "యువత భవిష్యత్తుకు నష్టం చేసింది మీరే. విద్యా వ్యవస్థ నిర్వీర్యమవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఉండిపోయింది" అని విమర్శించారు. విద్యార్థుల డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయని పేర్కొంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని, విద్యార్థులకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని, నిరసనకారులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

### ధర్మేంద్ర రాజీనామా డిమాండ్ పునరుద్ఘాటించిన సీజేపీ

మరోవైపు, నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంపై ఆందోళనలు చేపడుతున్న సీజేపీ కూడా ప్రధాని ప్రకటనపై స్పందించింది. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను మరోసారి పునరుద్ఘాటించింది. ఇదిలా ఉండగా, సీజేపీ నిరసనల నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా గురువారం కూడా ఢిల్లీలోని 16 మెట్రో స్టేషన్లను అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు.

# తెలంగాణ గుండెకాయ సింగరేణి

## ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**సత్తుపల్లి, జూలై 23:** సింగరేణి కాలరీస్ సంస్థ తెలంగాణ రాష్ట్ర గుండెచప్పుడు అని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ సంస్థతో రాష్ట్ర ప్రజలకు, కార్మికులకు విడదీయరాని భావోద్వేగ బంధం ఉందని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. లాభదాయకమైన ఈ ప్రభుత్వ రంగాన్ని కాపాడుకోవడమే కాకుండా, రాబోయే తరాలకు అత్యంత సర్థవంతంగా పనిచేసే లాభదాయక సంస్థగా అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని జేవీఆర్ ఓపెన్ కాస్ట్ గనిని గురువారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి, బొగ్గు నిల్వలు, ఉత్పత్తి విధానం, నాణ్యతా ప్రమాణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఒకప్పుడు బొగ్గు రంగంలో సింగరేణికి ఏకచ్ఛత్రాధిపత్యం ఉండేదని, కానీ ప్రస్తుతం ప్రైవేట్ సంస్థల రాక, విదేశీ బొగ్గు దిగుమతుల వల్ల మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ పోటీని తట్టుకుని నిలబడాలంటే సింగరేణి అత్యుత్తమ నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేయడంతో పాటు ఉత్పత్తి వ్యయాన్ని గణనీయంగా తగ్గించుకోవాలని సూచించారు. గని త్రవ్వకాల సమయంలో మట్టి, రాళ్ళు వంటి వ్యర్థాలు బొగ్గులో కలవకుండా ప్రతీ లోడింగ్ పాయింట్ వద్ద అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. నాణ్యత లేని బొగ్గును రవాణా చేయడం వల్ల అనవసర రవాణా ఖర్చులు పెరగడమే కాకుండా, థర్మల్ విద్యుత్ కేంద్రాలలో ఉత్పత్తి సామర్థ్యం తగ్గి ప్లాంట్లు ట్రిప్ అయ్యే ప్రమాదం ఉందన్నారు. అందుకే జెన్‌కోతో పాటు ఇతర వినియోగదారులకు నాణ్యమైన బొగ్గునే సరఫరా చేయాలని స్పష్టం చేశారు. గత దశాబ్ద కాలంలో కొత్త బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి అనేక అవకాశాలను కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేసిన భట్టి విక్రమార్క, కొత్త బొగ్గు బ్లాకు వేలంలో దక్కించుకున్న తర్వాత ఉత్పత్తి ప్రారంభించడానికి కనీసం 7 నుంచి 8 ఏళ్లు పడుతుంది కాబట్టి, కనీసం 10 ఏళ్ల ముందుచూపుతో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాడిచర్ల-II, ఒడిశాలోని నైని బొగ్గు బ్లాకులకు సంబంధించిన భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను వేగంగా పరిష్కరించామని, భవిష్యత్తులో దేశవ్యాప్తంగా జరిగే బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి పాల్గొనేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా హరిత ఇంధనానికి ప్రాధాన్యం పెరుగుతున్నందున సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాకుండా సోలార్, పంప్డ్ స్టోరేజ్,



హైడ్రోజన్, అణు విద్యుత్ రంగాల వైపు వేగంగా విస్తరించాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా సెమీకండక్టర్లు, చిప్ తయారీకి అత్యంత కీలకమైన క్రిటికల్, రేర్ ఎర్త్ మినరల్స్ త్రవ్వకాల పై కూడా దృష్టి సారించాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ హరీష్, సింగరేణి డైరెక్టర్ గౌతమ్ పోత్రు, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి, మాలోత్ రామ్‌దాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గత లీకేజీలకు కాంగ్రెస్ నేతలు రాజీనామా చేశారా?

- కాంగ్రెస్, కమ్యూనిస్టుల జంతర్ మంతర్ రాజకీయాలు
- టెన్త్ లీకేజీలో రేవంత్ రెడ్డి ఎందుకు రాజీనామా చేయలేదు
- కేంద్రమంత్రి మంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, జూలై 23 :** జంతర్ మంతర్‌లో జరుగుతున్న విద్యార్థుల ఆందోళనలు పట్టుకుని కాంగ్రెస్, కమ్యూనిస్ట్ పార్టీల నేతలు రాజకీయాలు చేస్తున్నారని కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చాలని చూస్తున్నారంటూ ప్రతిపక్ష పార్టీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పేపర్లు లీక్ అయినప్పుడు కాంగ్రెస్‌లోని నేతలు ఏ రోజైన రాజీనామా చేశారా? అని ఆ పార్టీ నేతలను నిలదీశారు. యూపీఏ హయాంలో ప్రశ్న పత్రాలు లీక్ అయ్యాయనే విషయాన్ని గుర్తు ఉంచుకోవాలని ఆ పార్టీ నేతలకు కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సూచించారు. దేశ రాజధాని న్యూఢిల్లీలోని జంతర్ మంతర్‌తోపాటు రాష్ట్రాల్లో జరుగుతున్న సంఘటనలు దురదృష్టకరమని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ సంఘటనలు రాజకీయ ప్రేరేపితమైనవని అభివర్ణించారు. గురువారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. గతంలో షాహిన్‌బాగ్‌లో ఆందోళనలు చేసిన నిరసనకారులు దీని వెనుక ఉన్నట్లు అనిపిస్తుందని అన్నారు. నీట్ పేపర్ లీక్ చేసిన వారిని అరెస్ట్ చేసి కేంద్ర ప్రభుత్వం జైలులో పెట్టిందని తెలిపారు. విద్యార్థులకు నష్టం జరగ వద్దని మరోసారి నీట్ పరీక్షను నిర్వహించామని వివరించారు. పేపర్ లీక్‌పై 2024 చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రాన్ని ప్రశ్నించే హక్కు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఉందా? అని బల్లగుద్దీ ప్రశ్నించారు. ఏ ముఖం పెట్టుకొని ప్రధాని ఇంటి ముందు ధర్నా చేస్తున్నారంటూ కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. ఫాస్ట్ ట్రాక్ ద్వారా చట్టాన్ని మరింత కఠినం చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పదో తరగతి పేపర్ లీక్ అయిందని అన్నారు. మరి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా ఎందుకు చేయలేదని ఆ పార్టీ నేతలను ఆయన నిలదీశారు. చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహించే సత్తా మీకు ఎక్కడిదంటూ తెలంగాణలోని అధికార పార్టీ నేతల తీరును ఆయన ఎండగట్టారు. విద్యార్థులపై ప్రేమ లేదంటూ కాంగ్రెస్ పార్టీ నేతలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నిప్పులు చెరిగారు.

# మహానగరం నడిబొడ్డున పేదోడికి ఇల్లు ఉండొద్దా

- పేదలకు ఇళ్లు కడితే... ఎందుకంత కడుపుమంట?
- పదేళ్లు చేయలేనిది కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే... విష ప్రచారమా?
- కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో పేదలకు వాటా ఇస్తే తప్పా?
- రూ. 60 లక్షల విలువైన ఇంటిని ఆరు లక్షలకే ఇస్తుంటే బీఆర్ఎస్ కు కడుపుమంట
- డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేదలను దగా చేసింది బిఆర్ఎస్
- ఇండ్ల కేటాయింపులో బడుగు బలహీన వర్గాలకు 50 శాతం రిజర్వేషన్లు
- బీఆర్ఎస్ తీరుపై మండిపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**హైదరాబాద్, జూలై 23:** హైదరాబాద్ మహానగరం నడిబొడ్డులో పేదలకు గౌరవ ప్రదమైన సొంతింటిని అందించాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పాన్ని చూసి బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర అసహనానికి గురవుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార,పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. నిరుపేదలు నివసిస్తున్న ప్రాంతంలోనే వారి సొంతింటి కలను నెరవేర్చడానికి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివసిస్తున్న ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని అన్నారు. ఈ ఇళ్ల కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న మీ సేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. అదేవిధంగా మీసేవ వాట్సాప్ నెంబర్ (8096958096), వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. గురువారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, దరఖాస్తులు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. సమీక్ష అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల పాలనలో వారు చేయలేని పనిని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలతో రాజకీయ లబ్ధిపొందాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో పేదల సొంతింటి కలను నెరవేర్చలేక పోయింది. నగరంలోనే పుట్టి పెరిగి అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలకు నగర నడిబొడ్డులో సొంతింటిని సమకూర్చవలసిన బాధ్యతను విస్మరించి, వారిని నగరానికి దూరంగా నెట్టివేసింది. ఉద్యోగాలు, ఉపాధి, పిల్లల చదువులు, వైద్య సౌకర్యాలకు దూరంగా 30?40 కిలోమీటర్ల దూరంలో కనీస వసతులు కల్పించకుండా అరకొరగా ఇళ్లను నిర్మించి అదే పేదల సంక్షేమమని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా ప్రభుత్వం పేదోడు కూడా హైదరాబాద్ నడిబొడ్డులోనే గౌరవంగా జీవించాలనే భావనతో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ప్రభుత్వ భూములను ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తూ పేదలకు శాశ్వత భరోసా కల్పించే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటే దానిపైనా బీఆర్ఎస్ విషప్రచారం చేస్తోంది. పేదోడు హైదరాబాద్‌లో ఉండకూడదా? నగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములలో పేదలకు ఇళ్లు నిర్మించకూడదా? ప్రభుత్వ భూములు కొద్దిమంది కోసం మాత్రమేనా? పేదల కోసం వినియోగిస్తే ఎందుకింత కడుపుమంటని అన్నారు. పేదోడిపై తుపాకి పెట్టి రాజకీయాలు చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గం. బీఆర్ఎస్ చేస్తున్న విష ప్రచారాలను, కపట నాటకాలను హైదరాబాద్ మహానగర ప్రజలు గమనించాలి, పేదల సంక్షేమాన్ని అడ్డుకునే రాజకీయాలను తిప్పికొట్టాలన్నారు. హైదరాబాద్‌లో సొంత ఇల్లు లేని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో నాణ్యమైన గృహాలను అందించడమే లక్ష్యం. గతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఇందిరమ్మ టవర్స్ గా మార్చి విక్రయిస్తారన్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాల ప్రకారమే ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. లబ్దిదారుల మీద ఆర్థిక భారం తగ్గించడానికి ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ ఇస్తోంది. ఇది అమ్మకం కాదు, ప్రభుత్వ ఆర్థిక సహకారం. లబ్దిదారుడి వాటా అన్ని ప్రాంతాల్లో రూ.6 లక్షలు మాత్రమే. ఎ÷–లాట్ల మార్కెట్ విలువ తొలి విడతలో ప్రారంభించనున్న 16 నియోజకవర్గాలలో రూ.40 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఉంటుందన్నారు. క్యూర్ పరిధిలో తొలి విడతగా ప్రయోగాత్మకంగా నిర్మించే ఇందిరమ్మ ఇళ్లలో యాజమాన్య హక్కుల రిజర్వేషన్‌కు సంబంధించి ఎస్సీలకు 14 శాతం, ఎస్టీలకు 5శాతం, బీసీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం , ప్రభుత్వ అవుట్ సోర్సింగ్, 4వ తరగతి ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులకు 10 శాతం చొప్పున మొత్తం 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నాం. ఈ 50 శాతం రిజర్వేషన్లలో కూడా 30 శాతం మహిళలకే కేటాయిస్తున్నాం. మిగిలిన 50 శాతం వాటా జనరల్ కేటగిరీలో కేటాయిస్తాం. పేద మధ్యతరగతి ప్రజల మీద బిఆర్ఎస్ కు... ఆ పార్టీ లోని దొరలకు ఏ మాత్రం అభిమానం, ప్రేమ ఉంటే విష ప్రచారాన్ని మానుకుంటారని ఆశిస్తున్నాను. ఈ విష ప్రచారాన్ని ఇదేవిధంగా కొనసాగిస్తే జూబ్లీ హిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికలలో పట్టిన గతే రాష్ట్ర వ్యాప్తంగా పడుతుందని మంత్రి పొంగులేటి వ్యాఖ్యానించారు.

# విద్యార్థులకు సకాలంలో యూనిఫామ్‌లు

- నాణ్యతలో రాజీపడకుండా సరఫరా
- క్యూర్ పరిధిలో మంచినీటి ప్రణాళికలు
- అధికారులను ఆదేశించిన రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, జులై 23 :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫామ్‌ల నాణ్యతలో రాజీపడబోమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. పంపిణీలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల యూనిఫామ్‌లపై అధికారులతో సీఎం సమీక్షించారు. విద్యార్థుల యూనిఫామ్‌లు త్వరగా సరఫరా చేసేలా సంస్థలపై ఒత్తిడి తేవాలి. ఆగస్ట్ 15 నాటికి విద్యార్థులకు వాటిని అందించాలన్నారు. ఆ తర్వాత ప్రతి విద్యార్థి నుంచి అభిప్రాయాన్ని సేకరించాలి. ఆ అభిప్రాయాల ఆధారంగా వచ్చే ఏడాది యూనిఫామ్‌లు పంపిణీ చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ఈ విషయంలో అడ్డగోలుగా వ్యవహరించారు. పేద పిల్లల కోసం పనిచేస్తున్నామన్న దృష్టితో అధికారులు పనిచేయాలి. వచ్చే ఏడాది జూన్ 2 నాటికే విద్యార్థులకు యూనిఫామ్‌లు అందేలా కార్యాచరణ రూపొందించాలని రేవంత్ ఆదేశించారు. ఇదిలావుంటే క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి) పరిధిలో తాగునీటి సరఫరాకు సంబంధించి సమగ్ర తాగు నీటి సరఫరా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు విలీన మున్సిపాలిటీల్లోనూ తాగు నీటి సరఫరాలో ఏకరూపత ఉండాలని చెప్పారు. రానున్న 50 ఏళ్ల అవసరాలకు తగినట్లు మాస్టర్ ప్లాన్ ఉండాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. హైదరాబాద్ మహానగర తాగునీటి సరఫరా, సీవరేజీ బోర్డు పరిధిలోని పనులపై ముఖ్యమంత్రి ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం నెలకొనడంతో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. హైదరాబాద్ చుట్టూ ఉన్న తాగునీటి వనరులను అనుసంధానించా లని చెప్పారు. ఏదైనా కారణాలతో ఒక సోర్స్ నుంచి నీరు సరఫరా కాకపోయినా మరో సోర్స్ నుంచి వచ్చే నీటిని ఆయా ప్రాంతాలకు సరఫరా చేసేందుకు అనుసంధానత ఉపయోగపడుతుందని అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో అనేక సంవత్సరాలుగా పలు ప్రాంతాల్లో మూడు నాలుగు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేస్తున్నారని, ఇక ముందు ఆ పరిస్థితి ఉండకూడదని ముఖ్యమంత్రి గారు చెప్పారు. ఆయా ప్రాంతాలకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తాగునీటి సరఫరా పనులను ఏడాదిన్నరలోపు కచ్చితంగా పూర్తి చేయాలని అధికారులకు తేల్చిచెప్పారు. ఎస్టీపీల నిర్మాణ పనులపై ముఖ్యమంత్రి గారు ఆరా తీశారు. ఎస్టీపీల నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా న్యాయపరమైన సమస్యలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని చెప్పారు. తాగునీటి సరఫరాకు సంబంధించిన పనులు, ఎస్టీపీల నిర్మాణ పనుల ప్రగతిపై ప్రతి నెల తనకు నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పనుల పురోగతి తెలుసుకునేందుకు వీలుగా డ్యాష్‌బోర్డును ఏర్పాటు చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో పరిశ్రమలు, వివిధ నిర్మాణ పనుల్లో గ్రే వాటర్ వాడేలా నిబంధనలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. సమీక్షలో మున్సిపల్ వ్యవహారాల ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయష్ రంజన్ గారు, సీఎం సెక్రటరీ మాణిక్ రాజ్ , జల మండలి ఎండీ కె అశోక్ రెడ్డి , జేఎండీ మయాంక్ మిట్టల్‌తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# త్వరలోనే ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పూర్తి

**ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తాం: కె. కేశవరావు**

**16 రోజులుగా వివిధ సంఘాలతో విస్తృత సంప్రదింపులు**

**జిల్లాల వారీగా సమావేశాలు.. ఆన్‌లైన్‌లోనూ అభిప్రాయాల సేకరణ**

**హైదరాబాద్, జూలై 23:** తెలంగాణ ఉద్యమకారులను సాధ్యమైనంత త్వరగా గుర్తించి రాష్ట్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామని తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ చైర్మన్ కె. కేశవరావు తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పారదర్శకంగా, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని చేపడుతున్నామని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, గత 16 రోజులుగా వివిధ ఉద్యమ సంఘాలు, ప్రజా సంస్థలు, రాజకీయ పార్టీలతో విస్తృత స్థాయిలో చర్చలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఉద్యమకారులను ఏ ప్రమాణాల ఆధారంగా గుర్తించాలి, వారికి ఎలాంటి గౌరవం కల్పించాలనే అంశాలపై అన్ని పార్టీల నుంచి సూచనలు స్వీకరించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అన్ని రాజకీయ పార్టీలు స్వాగతించాయని పేర్కొన్నారు. ఈ సంప్రదింపుల్లో సుమారు 13 వేల మంది పాల్గొనగా, దాదాపు వెయ్యి మంది తమ సూచనలు, అభిప్రాయాలను కమిటీకి అందజేశారని కేశవరావు వెల్లడించారు. సమావేశాలు ఇంకా కొనసాగుతున్నాయని, త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా అభిప్రాయాలు, దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. ఎఉద్యమకారులకు తగిన గౌరవం దక్కేలా కమిటీ బాధ్యతాయుతంగా పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యుడు, కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, త్వరలో జిల్లాల వారీగా పర్యటించి ఉద్యమకారులు, వివిధ సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. భవిష్యత్ కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన బీఆరెస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా ఈ చర్చలకు ఆహ్వానిస్తామని, అప్పటి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తామని వెల్లడించారు. డిసెంబర్‌లోపు కమిటీ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించేందుకు ప్రయత్నిస్తున్నామని అద్దంకి దయాకర్ తెలిపారు.

# సెలవు పెట్టినందుకు ఉద్యోగం నుంచి తొలగింపు

**టెక్ మహింద్రా సంస్థ ఉద్యోగిని ఫిర్యాదు**



**హైదరాబాద్, జూలై 23:** ప్రముఖ ఐటీ సంస్థ టెక్ మహీంద్రాపై మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని భావన దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనారోగ్యం కారణంగా తాను, అనంతరం తన చిన్నారి ఆరోగ్యం బాగోలేక సెలవులు తీసుకున్న నేపథ్యంలో ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా సంస్థ ఉద్యోగం నుంచి తొలగించిందని ఆమె ఆరోపించారు. భావన తెలిపిన వివరాల ప్రకారం, అనారోగ్యంతో 13 రోజుల పాటు సెలవులో ఉన్న సమయంలో, అలాగే తన కుమార్తె అనారోగ్యం కారణంగా మరికొన్ని రోజులు సెలవు తీసుకున్నప్పటికీ, యాజమాన్యం ఈ–మెయిల్‌ల ద్వారా వెంటనే విధులకు హాజరు కావాలని ఒత్తిడి తెచ్చిందని పేర్కొన్నారు. వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. అంతేకాకుండా, కార్యాలయంలో వాష్‌రూమ్‌కు వెళ్లాలన్నా అనుమతి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని, ఉద్యోగులపై అత్యంత కఠినమైన నిబంధనలు అమలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. మహిళా ఉద్యోగులకు కుటుంబ బాధ్యతలు, చిన్నారుల సంరక్షణ వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐటీ సంస్థలు మరింత మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భావన ఫిర్యాదును స్వీకరించిన దుండిగల్ పోలీసులు ఘటనకు సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నారు. మరోవైపు, ఈ ఆరోపణలపై టెక్ మహీంద్రా యాజమాన్యం నుంచి అధికారిక స్పందన రావాల్సి ఉంది.

# భూ వివాదంలో సినీ నిర్మాతలపై కేసులు

**వ్యాపారవేత్త రవిశంకర్ ఫిర్యాదు**

**హైదరాబాద్, జూలై 23:** హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న భూవివాదం నేపథ్యంలో ప్రముఖ సినీ నిర్మాత సి. కల్యాణ్, నిర్మాత బూరుగుపల్లి శివరామకృష్ణతో పాటు పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వ్యాపారవేత్త కాంతమనేని రవిశంకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివిధ సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జూబ్లీహిల్స్‌లోని ఉమెన్స్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఉన్న ప్లాట్ నంబర్ 89పై యాజమాన్య వివాదం కొనసాగుతోంది. ఈ స్థలం తమదేనంటూ సి. కల్యాణ్, బూరుగుపల్లి శివరామకృష్ణ గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో విచారణ జరిపిన న్యాయస్థానం జూన్ 10న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ, సదరు స్థలం ఫిర్యాదుదారు కాంతమనేని రవిశంకర్ ఆధీనంలోనే కొనసాగాలని, అనుమతి లేకుండా ఎవరూ ప్రవేశించరాదని ఆదేశించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా నిందితులు స్థలంలోకి అక్రమంగా ప్రవేశించి గేటు, తాళాలు ధ్వంసం చేశారని, అక్కడ ఉన్న సామగ్రిని చెల్లాచెదురు చేసి, సిబ్బందిని బెదిరించడంతో పాటు నిర్మించిన గదిని కూడా కూల్చివేశారని రవిశంకర్ ఆరోపించారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
శుక్రవారం
24 జూలై 2026



# యువత ఆక్రోశానికి సమాధానమేదీ?

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. వరుసగా నాలుగోరోజు కూడా ఉభయ సభల్లో గందరగోళం నెలకొంది. సమావేశాలు సజావుగా సాగడం లేదు. నీట్ లీకేజీపై ధర్మేంధ్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళనలకు దిగింది. నీట్ లీకేజీకి బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో సంసద్ చలో ఆందోళనకు పిలుపునిచ్చింది. వారి ఆందోళనలో వందశాతం న్యాయం ఉంది. ఎందుకంటే పరీక్షలను కూడా సక్రమంగా నిర్వహించలేని అసమర్థులు...పాలకులు అయినప్పుడు ప్రజలు స్పందిస్తారు. నిలదీస్తారు. నీట్ పరీక్ష వల్ల జరిగిన గందరోగళం ఎందరినో బలితీసుకుంది. ఎందరో తల్లిదండ్రులు క్షోభకు గురయ్యారు. దీనిని ఓ చిన్న సమస్యగా ప్రభుత్వం భావించి ఉండవచ్చు. కానీ విద్యార్థులకు మాత్రం ఇది జీవన్మరణ సమస్య. ఇకపోతే నాలుగు రోజులుగా గందరగోళం జరుగుతున్నా ప్రధాని మోడీ మౌనం వీడడం లేదు. కేవలం ఎక్స్ వేదికగా కఠినంగా వ్యవహరిస్తామని, నీట్ దోషుల కోసం ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించి చేతులు దులుపుకున్నారు. దేశంలో ఓ పెద్ద ఆందోళన జరుగుతంటే ఇదేనా ప్రధానిగా ఉన్న వ్యక్తి చేయాల్సిన పని. మణిపూర్ అల్లర్లు, ఢిల్లీలో రైతుల ఆందోళన, నీట్ పరీక్షా పేపర్ లీకేజీ, అయోధ్య విరాళాల చోరీ..ఇటీవల వరుసగా జరిగిన సంఘటనలు దేశాన్ని కుదిపేస్తున్నాయి. వీటిపై పార్లమెంటులో చర్చించడం జరగాలి. ప్రధాని మోడీ మౌనం వీడి పార్లమెంట్‌కు వచ్చి, నేరుగా సమాధానం చెప్పాల్సిన ముఖ్యమైన అంశాలు. దివంగత ప్రధాని మన్మోహన్ సింగ్‌ను మౌనమునిగా విమర్శించిన మోడీ ఇప్పుడు అంతకు మించి మౌనంగా మారారు. పార్లమెంట్ జరుగుతన్నా రాకుండా చోద్యం చూస్తూ ఎక్స్‌లో పోస్టులు పెట్టడం సరికాదు. ఇక్కడ సమాధానం చెప్పడం అంటే దేశప్రజలకు సమాధానం చేరవేయడంగా గుర్తించాలి. బాధ్యతగల ప్రధానిగా మోడీ పార్లమెంట్‌కు వచ్చి సమాధానం ఇవ్వాలి. కానీ అలా జరగడం లేదు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి లేదు. ఆయన వందిమాగధులు ఇదంతా విపక్షాలతో తమకున్న పంచాయితీలాగా సవాళ్లు విసరుతున్నారు. దేశం తీవ్ర ఆందోళనలో ఉంటే ఇదేనా పాలక పార్టీ వ్యవహరించే తీరు. ఇకపోతే దేశంలోని వ్యవస్థల్లో అవినీతి పాతుకుపోయిందనడానికి నీట్ పేపర్ లీకేజీ వంటివి పరాకాష్టగా చూడాలి. అవినీతి అన్నది రాజకీయ నాయకుల హక్కుగా మారింది. ప్రజలను ఏమార్చి, అధికారం చేపట్టగానే, ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప దేశహితం, దేశాన్ని ముందుకు తీసుకుని వెళ్లేందుకు అసవరమైన నిర్ణయాలు తక్కువే జరుగుతున్నాయి. ఇటీవల రామమందిరంలో విరాళాల చోరీ ఘటన తెలిసిందే. అవినీతి కేసుల్లో దోషులకు మరణశిక్ష విధించాలి. అవినీతి సాధారణమేనని సగటు భారత పౌరులు ఆలోచించే పరిస్థితి నెలకొన్నది. దొరికే వరకు కూడా ఇది తప్పు అని కూడా భావించడంలేదు. వ్యవస్థలో అవినీతిని రూపుమాపాలని ప్రభుత్వం నిజంగా భావిస్తే, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. చట్టాన్ని సవరించాలి. దోషులకు మరణ శిక్ష విధించేలా మార్పులు చేయాలి. ఉన్న చట్టాలతోనే కఠిన శిక్షలు విధించాలి. ఇకపోతే దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదు. గత పదేళ్లలో ఏకంగా 152 పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ అయ్యాయని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. సగటున నెలకు ఒక పేపర్ లీక్ అవుతున్నా బాధ్యులైన వారికి పడిన శిక్షలు మాత్రం సున్నా అని ధ్వజమెత్తారు. నిజంగానే ఇది ముమ్మాటికీ నిజం. నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీకి నిరసనగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడానికి ముందే ప్రధాని మోడీ పార్లమెంటులో స్పందించి ఉంటే ఈ గందరగోళం చెలరేగేది కాదు. ప్రతి ఆందోళనను రాజకీయ కోణంలో చూడడం, విపక్షాలను తిట్టిపోయడం వల్ల సమస్యలను పాలకులు గుర్తించడం లేదు. ఒకప్పుడు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన భారత విద్యా వ్యవస్థ.. అక్రమాలు, లీకేజీలకు నిలయంగా మారింది. దేశంలో పేపర్ లీకేజీలు ఒక పెద్ద మాఫియాగా మారాయి. దీని వెనుక ఉన్న బడాబాబులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతూ వస్తోంది. జంతర్ మంతర్ వద్ద భారతీయ యువత నిరసనలను సీరియస్‌గా తీసుకోవాల్సి ఉండగా, దానిని అణచివేయడం ఎలా అన్న ఆలోచననే అధికారపక్షం ఆలోచన చేయడం సరికాదు. నిరసనల్లో లక్ష మందికి పైగా యువకులు, విద్యార్థులు పాల్గొని ఉంటారని ఫోటోలు స్పష్టంగా సూచిస్తున్నాయి. తొలుత ఒక మార్చ్‌గా అనుకున్నది తరువాత నిరసన ప్రదర్శనగా పరిణమించింది. ఎంతోకాలంగా ఆగ్రహంతో ఉన్న యువత ఈ అవకాశాన్ని అనుకూలంగా తీసుకుని, వెల్లువెత్తి జనసంద్రంగా మారినట్లు మనకు కనిపిస్తోంది. మన దేశంలో రాజకీయ పార్టీల ర్యాలీలకు డబ్బులు, ఇతర ప్రలోభాలతో జనాన్ని సమీకరించడం పరిపాటి. అయితే ఈ నిరసన ప్రదర్శన అలా జరగలేదు. జంతర్ మంతర్‌కు చేరిన వారందరూ తమకు తాముగా స్వచ్ఛందంగా వచ్చినవారే. ప్రతి ఒక్కరూ సామాజిక మాధ్యమాలలో విజ్ఞప్తులకు ప్రతిస్పందించి స్వచ్ఛందంగా వచ్చినవారే. ఎవరి ప్రయాణ ఏర్పాట్లు వారే చేసుకుని, సుదూర ప్రాంతాల నుంచి నడిచి వచ్చినవారు చాలామంది ఉన్నారు. ఇంకో ముఖ్య విషయమేమంటే వచ్చిన వారిలో యువ మహిళల శాతం అత్యధికంగా ఉండడం. ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నవారిలో అత్యధికులు ఇటువంటి నిరసనలలో తొలిసారి పాల్గొన్నవారే కావడం మరో వాస్తవం. కేవలం నీట్ తదితర ప్రశ్నపత్రాల లీక్‌కు రగిలిపోయి మాత్రమే యువత జంతర్ మంతర్ వద్ద ధర్నాకు రాలేదని ఖచ్చితంగా చెప్పవచ్చు. దేశంలో పెచ్చరిల్లు తోన్న నిరుద్యోగం, అవినీతిమయమైన అధికార వ్యవస్థలు, రాజకీయ పార్టీల కపటాలు అన్నీ కలగలిపి వారిని ఈ నిరసనలో పాల్గొనేలా ప్రోత్సహించాయనే చెప్పాలి. విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకుని ఉద్యోగాలను వెతుక్కుంటున్న వారు, నియామకాలలో అవకతవకలకు బాధితులైనవారు ఎందరో ఆ నిరసనకారుల్లో ఉన్నారని చెప్పక తప్పదు. దేశ పాలనావ్యవస్థల్లో అవినీతి మితిమీరి, రాజకీయ అవినీతి పెరిగి పోవడం, పాలకుల విలాసాలు, ప్రజలేమో అవస్థల పాలవుతున్న తీరు కారణంగా యువత నిరసనలకు ఉద్యమించిందని చెప్పక తప్పదు. దీనికి విదేశీ హస్తం ఉందనో లేదా మరే ఇతర కారణాలనో చూపి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నాలు కూడా మంచిది కాదు. సమస్యలను గుర్తించి పాలకులు తమ తీరును మార్చుకోవాలి. ఇది కేంద్ర రాష్ట్రాల పాలకలుకు ఓ హెచ్చరిక కావాలి. అలాగే ఈ యువ నిరసన ఒక ఆరంభం మాత్రమే. ఇది దావానలంలా విస్తరించినా ఆశ్చర్య పోనవసరం లేదు. పాలకులు బుద్ధి తెచ్చుకుని మారకపోతే యువత చరిత్ర సృష్టిస్తుందని చెప్పక తప్పదు.

# నేడు దేశవ్యాప్త నిరసనలకు సీజేపీ పిలుపు

- నీట్ పేపర్ లీక్‌పై కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్
- శాంతియుత ఆందోళనలకే పరిమితం కావాలని యువతకు సూచన
- ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ప్రకటన మధ్య మరో ఉద్యమానికి సిద్ధమైన సీజేపీ



**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమిస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) జులై 24న దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఇటీవల జంతర్‌మంతర్--పార్లమెంట్ ర్యాలీ సందర్భంగా విద్యార్థులు, యువతపై జరిగిన పోలీసు చర్యలకు నిరసనగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పార్టీ వెల్లడించింది. దేశవ్యాప్తంగా నిరసనల నిర్వహణకు అవసరమైన అనుమతులు, ఇతర ఏర్పాట్లను స్థానికంగా పూర్తి చేసుకోవాలని యువత, విద్యార్థి సంఘాలు, యువజన సంస్థలకు సీజేపీ సూచించింది. నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో పార్టీ డిమాండ్లను బహిరంగంగా ప్రజలకు వివరించాలని కోరింది. నిరసనల్లో బాధిత విద్యార్థులకు సంఘీభావంగా "ఇంక్విలాబ్ జిందాబాద్", "భారత్ మాతాకీ జై" వంటి నినాదాలు మాత్రమే చేయాలని, ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు లేదా ఉద్రిక్తతలకు దారితీసే చర్యలకు పాల్పడవద్దని పార్టీ సూచించింది. అనుమతి పొందిన ప్రాంతాల్లోనే నిరసనలు నిర్వహించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని, ఎలాంటి ప్రేరేపణలకు స్పందించవద్దని పిలుపునిచ్చింది. ఇదిలా ఉండగా, నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో దోషులపై వేగంగా విచారణ పూర్తి చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

# దమ్ముంటే నీట్‌పై పార్లమెంట్‌లో చర్చకు రావాలి


- విపక్షాలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్
- విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన ఏ అంశంపైనా చర్చకు సిద్ధమన్న ఎన్డీఏ
- రాహుల్ గాంధీ సభలో చర్చను తప్పించుకుంటున్నారని ఆరోపణ



**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పరీక్ష, పేపర్ లీకేజీ వ్యవహారంపై పార్లమెంట్ వేదికగా బహిరంగ చర్చకు విపక్షాలు సిద్ధమా అని భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సవాల్ విసిరారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించిన ప్రతి అంశంపైనా చర్చించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన పేర్కొన్నారు. మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి పార్టీలు పార్లమెంట్‌లో చర్చకు ముందుకు రావడం లేదని, సభలో చర్చ జరిగితే వారి వైఖరి ప్రజల ముందుకు వస్తుందనే భయంతోనే వెనకడుగు వేస్తున్నారని ఆరోపించారు. నీట్ పేపర్ లీకేజీ కేసుల్లో దోషులకు కఠిన శిక్షలు విధించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన నేపథ్యంలో రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ప్రతిస్పందిస్తూ నితిన్ నబిన్ ఈ వ్యాఖ్యలు చేశారు."విద్యార్థులు, యువత భవిష్యత్తుకు సంబంధించిన ఏ అంశంపైనైనా పార్లమెంట్‌లో చర్చించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. నీట్ సహా అన్ని అంశాలపై చర్చకు విపక్షాలు ముందుకు రావాలి" అని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ రాజకీయ ప్రస్థానం అంతా బాధ్యత నుంచి తప్పించుకోవడమేనని, కాంగ్రెస్ పార్టీ దశాబ్దాలుగా యువతను తప్పుదారి పట్టించిందని నితిన్ నబిన్ విమర్శించారు. పార్లమెంట్‌లో చర్చ జరిగితే తమ వైఖరి బయటపడుతుందనే కారణంతోనే విపక్షాలు చర్చను నివారిస్తున్నాయని ఆయన ఆరోపించారు. యువతను నిరసనలకు మాత్రమే పరిమితం చేసే రాజకీయానికి బదులుగా, వారికి సురక్షితమైన, ఉజ్వలమైన భవిష్యత్తు కల్పించడమే ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని నితిన్ నబిన్ స్పష్టం చేశారు.

# ఢిల్లీలో మెట్రో స్టేషన్ల మూసివేతపై సుప్రీంకోర్టు అసంతృప్తి

## మధ్యాహ్నంలోగా పరిస్థితి సరిచేయాలి : సీజేఐ




**న్యూఢిల్లీ, జూలై 23:** సీజేపీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిరసనల నేపథ్యంలో ఢిల్లీలో పలు మెట్రో స్టేషన్లను మూసివేయడంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలతో పాటు సుప్రీంకోర్టుకు వచ్చే న్యాయవాదులు, వ్యాజ్యదారులు, కోర్టు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, మధ్యాహ్నంలోగా పరిస్థితిని సరిదిద్దకపోతే సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సీజేపీ చేపట్టిన నిరసనలను దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ వరుసగా రెండో రోజూ 16 మెట్రో స్టేషన్లను మూసివేసింది. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మెట్రో స్టేషన్ల మూసివేత వల్ల సుప్రీంకోర్టుకు వచ్చే న్యాయవాదులు, వ్యాజ్యదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. మధ్యాహ్నం వరకు పరిస్థితిని పరిశీలిస్తామని, అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే కోర్టు తగిన ఆదేశాలు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. ఇదిలా ఉండగా, జంతర్‌మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రశ్నపత్రాల లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ఢిల్లీ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నీట్ పేపర్ లీకేజీ వ్యవహారం పార్లమెంట్‌లోనూ ప్రతిధ్వనిస్తుండగా, అధికార, ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయ సభల కార్యకలాపాలు పలుమార్లు అంతరాయం చెందాయి.

# విద్యార్థులతో కేంద్రం చర్చలు జరపాలి

## జంతర్‌మంతర్ నిరసనలపై స్పందించిన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్

## విద్యా వ్యవస్థ ప్రక్షాళనకు కొత్త బిల్లు తీసుకురావాలని సూచన



**న్యూఢిల్లీ, జూలై 23:** పేపర్ లీకేజీలు, విద్యా వ్యవస్థలో లోపాలపై జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులతో కేంద్ర ప్రభుత్వం నేరుగా చర్చలు జరపాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ కోరారు. విద్యార్థులు ప్రస్తుత పరీక్షల వ్యవస్థపై నమ్మకం కోల్పోయారని, వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల డిమాండ్లను వినాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉందని ప్రియాంక పేర్కొన్నారు. వ్యవస్థ అందించే అరకొర పరిష్కారాలను విద్యార్థులు ఇకపై అంగీకరించే పరిస్థితిలో లేరని వ్యాఖ్యానించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై జరిగిన లాఠీఛార్జ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. "సోషల్ మీడియాలో విద్యార్థులపై నమ్మకం ఉందని చెబుతూ, మరోవైపు వారిపై లాఠీఛార్జ్ చేయించడం సరైంది కాదు. నిజంగా విద్యార్థులపై శ్రద్ధ ఉంటే వారిని పిలిచి మాట్లాడాలి" అని కేంద్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ప్రియాంక గాంధీ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ తీరును విమర్శిస్తూ ఒక ఉదాహరణను ప్రస్తావించిన ఆమె, "పిల్లలు డిజైనర్ కావాలనుకుంటే వారి మాట వినకుండా ఇంజినీరింగ్ కాలేజీలో సీటు బుక్ చేసినట్లు ప్రభుత్వ వైఖరి కనిపిస్తోంది" అని అన్నారు. జంతర్‌మంతర్ వద్ద వేలాదిగా చేరిన యువత ఆవేదనను రాజకీయాలకు అతీతంగా వినాలని, విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసేలా సమగ్ర చట్టాన్ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ప్రియాంక గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ప్రతిపక్షాల పట్టు

- నీట్ అంశంపై దుమారం..
- నేటికి లోక్‌సభ వాయిదా
- రాజీనామా తర్వాతే చర్చ అంటున్న ప్రతిపక్షాలు
- చర్చ నుంచి తప్పించుకుంటున్నారంటూ విపక్షాలపై కేంద్రం విమర్శలు



**న్యూఢిల్లీ, జూలై 23:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై పార్లమెంట్‌లో మరోసారి తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు పట్టుబట్టడంతో లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేశారు. రాజ్యసభను మధ్యాహ్నం 3 గంటల వరకు వాయిదా వేశారు. లోక్‌సభ సమావేశం ప్రారంభమైన వెంటనే నీట్ పేపర్ లీక్ అంశంపై ప్రభుత్వం బాధ్యత వహించాలని, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. నిరసనల మధ్య సభ పలుమార్లు వాయిదా పడింది. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ, పేపర్ లీక్ జరిగినట్లు ప్రభుత్వం అంగీకరిస్తే వెంటనే ధర్మేంద్ర ప్రధాన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ, రూల్--267 కింద చర్చ చేపట్టాలని ప్రతిపక్షాలు కోరుతున్నప్పటికీ ప్రభుత్వం అంగీకరించడం లేదన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను కేంద్ర ప్రభుత్వం అవమానించిందని ఆరోపించిన ఆయన, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన తర్వాతే చర్చకు హాజరవుతామని స్పష్టం చేశారు. మరోవైపు ప్రతిపక్షాల వైఖరిపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తీవ్ర విమర్శలు చేశారు. నీట్ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా ప్రతిపక్షాలే అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. చర్చకు ముందే షరతులు విధించడం సమంజసం కాదని పేర్కొంటూ, ఈ అంశంపై ప్రభుత్వానికీ తన వాదనను వినిపించే హక్కు ఉందన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే పనిలో రాహుల్ గాంధీ

**మన్ కి బాత్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎలగతి సుచిత్**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ప్రపంచంలోనే అతి పెద్ద దైన ప్రజాస్వామ్య దేశంగా కీర్తించబడుతున్న భారతదేశ రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నివాసాన్ని ముట్టడించే ప్రయత్నం తన అవివేకతనాన్ని తెలియజేస్తుందని మన్ కీ బాత్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఎలగతి సుచిత్ తెలియజేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంపై నమ్మకం లేకనే రాహుల్ గాంధీ ఈ దుక్షర్యకు పాల్పడ్డారని పార్లమెంట్ నడుస్తున్న సందర్భంలో పార్లమెంట్ ఆవరణలో తన గళాన్ని వినిపించాల్సింది పోయి పిరికి పందలాగ యువతను తప్పుదోవ పట్టించాలనే ఉద్దేశంతో జాతి వ్యతిరేక శక్తులను కూడా కట్టుకొని ప్రపంచంలో భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ని అపరాధిగా చూపించే ప్రయత్నం చేశారని, కేవలం యువతను అయోమయంలో పడేసి తన రాజకీయ కుటంత్రంలో యువతను బలి పశువు చేసే ప్రయత్నం చేశారని ఆరోపించించారు. జంతర్ మంతర్ వద్ద క్రాక్రోచ్ జనత పార్టీ చేస్తున్న నిరసన దీక్ష కేవలం నీట్ పరీక్ష అవకతవకలపై కాదని యావత్ భారతాన్ని విభజించే ప్రయత్నం అని, ఈ దీక్ష కేవలం వారి స్వార్థ రాజకీయాల కోసమే అని ఆరోపించారు.

## కాగజ్‌నగర్ పేపర్ మిల్ కార్మికుల ఎన్నికలపై మంత్రి వివేక్ సానుకూల స్పందన



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ టౌన్:** కాగజ్‌నగర్ పేపర్ మిల్ కార్మికుల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని, త్వరలోనే సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి హామీ ఇచ్చారని జాతీయ కాంగ్రెస్ మహిళా కార్యదర్శి అదిత తెలిపారు.ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్ లో కార్మిక మంత్రి వివేక్ వెంకటస్వామితో పాటు పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను అదిత మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా కాగజ్‌నగర్ పేపర్ మిల్లు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రధానంగా కార్మిక సంఘ ఎన్నికల నిర్వహణ అంశంపై వారితో సుదీర్ఘంగా చర్చించారు. మిల్లు కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమం కోసం ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాల్సిన అవసరాన్ని అదిత ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. కార్మికుల సమస్యల పట్ల స్పందించిన మంత్రి వివేక్, ఎన్నికల ప్రక్రియ , కార్మికుల సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని ఆమె వెల్లడించారు. కార్మికుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేపర్ మిల్ కార్మికులకు అండగా ఉంటామని ఈ సందర్భంగా అదిత తెలిపారు.

## లంకపల్లి సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టిన బొగ్గు టిప్పర్**

**డ్రైవర్కు తీవ్ర గాయాలు**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా లంకపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రోడ్డుపై ఆగి ఉన్న ఓ లారీని వేగంగా వచ్చిన బొగ్గు టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ క్యాబిన్ పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో డ్రైవర్ అందులోనే ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో డ్రైవర్ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన డ్రైవర్ను వెంటనే పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంతో కొంతసేపు జాతీయ రహదారిపై ట్రాఫిక్కు అంతరాయం ఏర్పడగా, పోలీసులు ట్రాఫిక్కు నియంత్రించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు





- జిల్లా కలెక్టర్ కె. హరిత
- మోవాడ్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు
- నిర్లక్ష్య సిబ్బందికి గైర్హాజరు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్:** విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె. హరిత స్పష్టం చేశారు. గురువారం ఆసిఫాబాద్ మండలం మోవాడ్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం, ఆశ్రమ పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంపై అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓపీ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లు ఖాళీగా ఉండటం, మందుల వివరాలు నమోదు చేయకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. గత పది రోజులుగా సిబ్బంది హాజరు నమోదు కాకపోవడంతో సంబంధిత సిబ్బందికి గైర్హాజరు వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.అనంతరం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను సందర్శించిన కలెక్టర్, 58 మంది విద్యార్థులకు గాను 10 మంది ఉపాధ్యాయులు ఉండడాన్ని గమనించి, విద్యార్థుల హాజరు శాతాన్ని వెంటనే పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా ముచ్చటించారు. విద్యాబోధన, మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, తాగునీటి సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఆర్ఓ తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని ఉపాధ్యాయులను, అధికారులను ఆదేశించారు.అలాగే, గ్రామంలో సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై గ్రామ పటేల్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం తమ వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. వేరే ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల వివరాలను కూడా ఫారమ్‌లలో నమోదు చేసి సంబంధిత బి.ఎల్.ఓ లకు అందజేయాలని గ్రామస్తులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో 100 శాతం డిజిటలైజేషన్ పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్ట ర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, శిక్షణ ఉపపాలనాధికారి జాస్టిన్ జోన్, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్ లు మెంగ్రే ఆకాష్, పహీమ్ సుల్తానా, ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ ఎండి. అహ్మద్ లతో కలిసి ఎస్.ఐ.ఆర్. ప్రక్రియపై మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 85.94 శాతం ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి అయిందని, మిగిలిన 14 శాతం పూర్తి చేసి 100 శాతం అయ్యేలా రాజకీయ పార్టీలు, మున్సిపాలిటీల పాలకవర్గాలు సహకరించాలని తెలిపారు. కాగజ్ నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలలో ఇంకా చాలా మంది ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలని, ఫారాలు బూత్ స్థాయి అధికారులకు అందించని పక్షంలో వారు ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు. ఫారాలు అందించని వారి జాబితా అందించడం జరుగుతుందని, వారిని గుర్తించి ఫారాలు అందించేలా రాజకీయ పార్టీలు దృష్టి సారించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టడం జరుగుతుందని, ఎ.ఎస్.డి. ఓటర్ల జాబితాలో సిద్ధం చేయడం జరుగుతుందని, మరణించిన వారు, గ్రామం వదిలి వెళ్ళిన వారి జాబితాను సిద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక హోటలు సమగ్ర



సవరణ ప్రక్రియను నిర్ణీత గడువుకు ముందే 100 డిజిటలైజేషన్ అయ్యేలా రాజకీయ పార్టీలు క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి ఏజెంట్లు సహకరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల జీవితాలతో ఆటలాడితే ఊరుకోం

- నైతిక బాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలి




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని, నీట్ పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేయాలని పిడిఎస్ యు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి మాట్లాడుతూ అవకతవకలు, పేపర్ లీకేజీలకు నిలయంగా మారిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ని వెంటనే రద్దు చేయాలని, ఈ స్కామ్‌పై సుప్రీంకోర్టు జడ్జితో సమగ్ర న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై దేశ రాజధానిలో శాంతియుతంగా పోరాడుతున్న విద్యార్థులు, మేధావులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడం, విద్యార్థుల పక్షాన నిలిచిన సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్ట్ చేయడం దుర్మార్గమైన చర్య అని, బీజేపీ ప్రభుత్వ అణచివేత వైఖరికి తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన రాష్ట్రవ్యాప్త జూనియర్, డిగ్రీ ఇంజనీరింగ్ విద్యాసంస్థల బంద్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాతంత్రవాదులు పెద్ద ఎత్తున మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ జిల్లా ఉపాధ్యక్షులు షేక్ అయ్యుబ్ ఖాన్, ఆసిఫాబాద్ మండల అధ్యక్ష కార్యదర్శులు సమీర్, తరుణ్, నాయకులు శివ శంకర్, శ్రీకాంత్, రిజ్వాన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** పట్టణంలోని పైకాజీ నగర్ లో గురువారం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాలనీలోని ప్రధాన డ్రైనేజీలలో పేరుకు పోయిన పూడికను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, వార్డు కౌన్సిలర్ బాలకృష్ణతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ లు మాట్లాడుతూ కాలనీవాసులకు ఎలాంటి ఆరోగ్య, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా నిరంతరం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాలనీలోని మిగతా సమస్యలను కూడా త్వరలోనే గుర్తించి, వాటి పరిష్కారం కోసం శాయశక్తులా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంలో కాలనీ ప్రజలు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## 'ఎస్ఐఆర్' దరఖాస్తుల పై నిర్లక్ష్యం వద్దు

- మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్ వాడి, పరిధిలో గురువారం 'ఎస్ఐఆర్' (SIR) దరఖాస్తుల ప్రక్రియ ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ తహసిల్దార్ రియాజ్ అలీ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి, పర్యవేక్షించారు. దరఖాస్తుల స్వీకరణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్‌లు స్వయంగా హాజరై, అక్కడికి వచ్చిన ప్రజల ఎస్ఐఆర్ ఫారాలను దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ లు మాట్లాడుతూ ప్రజలెవరూ నిర్లక్ష్యం చేయకుండా వెంటనే తమ ఎస్ఐఆర్ దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసుకోవాలి సూచించారు. ఓటుని కోల్పోయే ప్రమాదం ఉంది కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండి ఎస్ఆర్ఐ ప్రక్రియను నిర్దే శిత ప్రమాణాల ప్రకారం పూర్తి చేసి బిఎల్ఓలకు దరఖాస్తుల ఫారాలు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సుధాకర్, బి ఎల్ ఓ లక్ష్మీ, నాయకులు షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.



# పి.డి.ఎస్. బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** జిల్లాలోని రేషన్ కార్డుదారులకు, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడి కేంద్రాలలో మధ్యాహ్న భోజనం కొరకు అందిస్తున్న సన్నబియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహార భద్రత విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఆసిఫాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావులతో కలిసి హాజరయ్యారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు, అంగన్వాడీలకు మధ్యాహ్న భోజనం, సంక్షేమ వసతి గృహాలకు అందిస్తున్న సన్నబియ్యం పక్కదారి పట్టకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో 315 చౌక ధరల దుకాణాలు ఉన్నాయని, 973 అంగన్వాడీ కేంద్రాలు, 1 వేయి 173 పాఠశాలలకు, 115 సంక్షేమ పద్ధతి గృహాలకు దాదాపుగా ప్రతినెలా 3 వేల 205 మెట్రిక్ తండ్రుల బియ్యం సరఫరా చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎక్కడి నుండి అయినా ఏ షాపు నుండి అయినా పోర్టబిలిటీ ద్వారా రేషన్ కార్డుదారులు బియ్యం తీసుకునే సదుపాయం ఉందని, జిల్లాలో కార్డుదారులకు డీలర్లు సక్రమంగా బియ్యం పంపిణీ చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఇంకా 40 డీలర్ల పోస్టు లు ఖాళీలు ఉన్నాయని, వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలని రాజస్వ మండల అధికారులకు ఆదేశించారు. ఇంకా చాలా గ్రామాల ప్రజలు నూతన చౌక ధరల దుకాణాలు ఏర్పాటు చేయాలని కోరుతూ తమ దృష్టికి తీసుకువస్తున్నారని, అట్టి జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ – కె.వై.సి. చేసుకోనివారు ఈనెల 31వ తేదీ లోగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ శాసనసభ్యులు మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి కార్డుదారుడికి బియ్యం పంపిణీ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. రవాణా సౌకర్యం లేని గ్రామాలకు 3 నెలల బియ్యం కోటాను ముందే సరఫరా చేయాలని, పెండింగ్ లో ఉన్న రేషన్ కార్డులను త్వరగా మంజూరు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, జిల్లా పౌర సరఫరాల అధికారి సాధిక్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, పౌరసరఫరాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటాం

- **ముని్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్**

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** గత రెండు రోజులుగా కురుస్తున్న మోస్తరు వర్షాల ధాటికి ఆసిఫాబాద్ పట్టణంలోని మేకలవాడకు చెందిన జూలాల లక్ష్మి అనే నిరుపేద మహిళ ఇంటి గోడలు ఒక్కసారిగా కూలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కౌన్సిలర్ జేబ షేక్ వెంటనే స్పందించి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్‌లకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పురపాలక పాలకవర్గం అధికారులు గురువారం దెబ్బతిన్న లక్ష్మి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

**బాధితురాలికి కొండంత భరోసా**

ఇంటి గోడలు కూలిపోయి తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న జూలాల లక్ష్మిని మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, అధికారులు ఓదార్చి ధైర్యం చెప్పారు. వర్షాల వల్ల నష్టపోయిన ఆమెకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని, అలాగే ప్రభుత్వ పరంగా అందాల్సిన ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున బాధితురాలికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రియాజ్ అలీ, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, కౌన్సిలర్లు చిలువేరు వెంకటేశ్వర్లు, సాలం బీన్



అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు సమద్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులపై లాఠీ చార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

- **కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ(బోథ్):** ప్రస్తుతం వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో ఉభయ సభల్లో నీట్ లీకేజీ వ్యవహారంపై, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులపై చర్యలు తీసుకునే వరకు, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు వివిధ రూపాల్లో ఆందోళన కార్యక్రమాలు జరుగుతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి పేర్కొన్నారు. ఏఐసీసీ, పీసీసీ పిలుపు మేరకు బోథ్ మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో, విద్యార్థులు ఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొని మాట్లాడారు. చట్టాలు చేసే పార్లమెంట్లో చర్చలకు బీజేపీ ప్రభుత్వం రాకపోవడంతోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇంటివద్ద నిరసన



తెలుపాల్సిన అవసరం ఏర్పడిందని అన్నారు. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసింతవరకు ఈ నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు యువకుల వద్ద ఉద్దేశపూర్వకంగా బీజేపీ నాయకులు చొరబడి హింసకు ప్రేరేపిస్తున్నారని అన్నారు. భద్రత బలగాలను అవహేళన చేస్తున్నానని, విద్యార్థి ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయని తెలిపారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలో నిర్మాణం అవుతుంటే బీజేపీ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్లో అపహాస్యం అవుతుందని అన్నారు. రానున్న రోజుల్లో తప్పకుండా దీనికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని బీజేపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్షుడు మెరుగు భోజన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు, డీసీసీ సెక్రటరీ ఎల్మ వినయ్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కురుమే మహేందర్, ఉప సర్పంచ్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుద్దుల అరుణ్ కుమార్ రెడ్డి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్, సీనియర్ వార్డ్ మెంబర్ షేక్ షాకీర్, రైతు నాయకులు యాళ్ల ఇంద్రారెడ్డి, రహీముద్దీన్, చమేందర్ రెడ్డి, షేక్ అబుద్, సీనియర్ కాంగ్రెస్ నేత మాజీ ఎంపిటిసి చట్ల ఉమేష్, భీమ బుచ్చన్న, వోటర్ కర్ రాజశేఖర్, సాయన్న, ప్రభాకర్, కౌసర్, శంషుద్దీన్, గంగయ్య, యూసుఫ్, సన్నీ రెడ్డి, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మెరుగు నరసింహ దాసు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 విజేత దుర్గం క్రాంతికి ఘన సన్మానం

**ఉద్యమ కెరటం, తాండూర్:** గ్రూప్-1లో ఉద్యోగం సాధించి మంచిర్యాల జిల్లా లేబర్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్గా బాధ్యతలు నిర్వహిస్తున్న దుర్గం క్రాంతిని దళిత, ఆదివాసి, బహుజన, మైనారిటీ సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ చిన్న వయసులో గ్రూప్-1 అధికారి కావడం దుర్గం క్రాంతి కృషి, పట్టుదలకు నిదర్శనమని కొనియాడారు. దళిత వర్గానికి చెందిన యువకుడు ప్రతిష్ఠాత్మకమైన ఉద్యోగాన్ని సాధించడం సమాజానికే గర్వకారణమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. దళితులు, ఆదివాసీలు, బహుజనులు, మైనారిటీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ దుర్గం క్రాంతి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో సేవలందించే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యను ఓపికగా విని, చట్ట బద్ధంగా, నిబంధనలకు అనుగుణంగా న్యాయం జరిగేలా విధులు నిర్వహిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత, ఆదివాసి, బహుజన,



మైనారిటీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గొర్లపల్లి వెంకటేష్, ప్రచార కార్యదర్శులు పరుస శ్రీనివాస్, ఆకుల తిరుపతి, వెంగళ రమేష్, గొర్లపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మేంద్ర ప్రధాన్ను వెంటనే భర్తరఫ్ చేయాలి

- **రేపటి విద్యాసంస్థల బంద్ను విజయవంతం చేయండి**
- **ఏఐఎఫ్డీఎస్, ఏఐఎస్ఎఫ్ పిలుపు**




**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ను తక్షణమే కేంద్ర మంత్రివర్గం నుంచి భర్తరఫ్ చేయాలని ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పల్లె మురళి, గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎఫ్డీఎస్, ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మదీనాగూడ నుంచి చందానగర్ అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో విద్యార్థులు, యువత ప్రజాస్వామ్య హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతుంటే వారిపై నిర్బంధ చర్యలు చేపట్టడం దారుణమన్నారు. బీజేపీ ప్రభుత్వం బ్రిటీష్ పాలనను తలపించేలా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులు, యువతపై లాఠీచార్జీ, బాష్పవాయువు ప్రయోగం చేయడం, దాడులకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. విద్యార్థులపై జరిగిన దాడులకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వెంటనే మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్లో కొనసాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంఘీభావంగా ఏఐఎఫ్డీఎస్, వామపక్ష విద్యార్థి సంఘాల తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించనున్న విద్యా సంస్థల బంద్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్డీఎస్ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి తేజ, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు అరుణ్, గణేష్, దుర్గాప్రసాద్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## వడుర్ గ్రామ పంచాయతీలో వంద శాతం ఎస్ఐఆర్ ప్రక్రియ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియ మండలంలోని వడూర్ గ్రామపంచాయతీలో వంద శాతం పూర్తయినట్లు కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్-2 చంద్రశేఖర్ తెలిపారు. వడూర్లోని 285, 286 పోలింగ్ బూత్ల పరిధిలో ఈ సర్వే విజయవంతంగా ముగిసిందని పేర్కొన్నారు. సంబంధిత బూత్ లెవెల్ ఆఫీసర్లు రాజేశ్వర్, మమతలు సహకారంతో ఈ ప్రక్రియను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయడం జరిగిందన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఆడేపు శ్రీకాంత్ మాట్లాడుతూ గ్రామ ప్రజల భాగస్వామ్యం, అధికారుల సమిష్టి కృషితోనే వాడూర్లో సర్ ప్రక్రియ వంద శాతం పూర్తికావడం జరిగిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ అందడంలో ఈ ప్రక్రియ ఎంతో కీలకమని అన్నారు. సకాలంలో సర్వే పూర్తి చేసిన బీఎల్ఓలకు, సహకరించిన గ్రామస్తులకు, పార్టీ శ్రేణులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. విజయవంతంగా బాధ్యతలు నిర్వర్తించిన బీఎల్ఓలను కాంగ్రెస్ పార్టీ బిఎల్ఎ చంద్రశేఖర్ శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి ఎండి.సద్దాం, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పుల ఊషన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి మొక్క జీవన మనుగడకు పునాది

**మాదారం గ్రామంలో ఇంటింటికి మొక్కల పంపిణీ**



**ఉద్యమ కెరటం, తాండూర్:** మనం నాటే ప్రతి మొక్క మన జీవన మనుగడకు పునాది అని తాండూర్ ఎంపీడీఓ పి.శ్రీనివాస్, మాదారం ఎస్సై బి.సౌజన్య అన్నారు. గురువారం తాండూర్ మండలం మాదారం గ్రామపంచాయతీలో మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు ఎస్.రవీందర్ రెడ్డి, మాదారం సర్పంచ్ కృష్ణపల్లి లక్ష్మణ్తో కలిసి ప్రతి ఇంటికి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెట్లు భవిష్యత్ తరాల జీవన నాణ్యతను నిర్ణయిస్తుందని, దీంతో ప్రతిఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పెరుగుతున్న వాతావరణ కాలుష్యంతో జీవన మనుగడకు ముప్పు ఏర్పడుతోందని తెలిపారు. ప్రకృతిని కాపాడేందుకు చెట్ల పెంపకమే ఉత్తమ మార్గమని చెప్పారు. అడవుల విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రతిఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ సత్యనారాయణ, నర్సాపూర్ సర్పంచ్ పరప తిరావు, ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షులు పేరం శ్రీనివాస్, మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ పేరం మాధవి, వార్డు సభ్యులు గొర్లపల్లి బానేష్, కత్తెర్ల రవికుమార్, కాంగ్రెస్ నాయకులు పెట్టం భీమేష్, సిరికొండ సత్యనారాయణ, ఉపాధిహామీ టిఈ ప్రసాద్, మేట్ పుప్పాల పుష్పతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రంలో అన్నప్రాసన కార్యక్రమం



**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని రాజీవ్ నగర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం అన్నప్రాసన కార్యక్రమంతో పాటు కోడిగుడ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మామిడాల లలితా-రాజేశం, ఉప సర్పంచ్ కాపర్తి సుభాష్ పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. అనంతరం కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల లోపు పిల్లలను క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రాలకు పంపిస్తే క్రమశిక్షణతో పాటు బాలామృతం వంటి పోషకాహారాన్ని అందుకోవడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని తెలిపారు. చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడానికి అంగన్వాడీ కేంద్రాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ సంక్షేమ సేవలను సద్వినియోగం చేసుకొని పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు టి.రాంప్రసాద్, లింగంపల్లి అభిలాష, ఎల్దండి కవిత, రౌతు భారతి, చెప్యల నిరంజన్ రావు, పంచాయతీ కార్యదర్శి రామాదేవి, అంగన్వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జంగంలో ప్రత్యేక పారిశుధ్య చర్యలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** వర్షా కాలంలో డెంగ్యూ, మలేరియా, చికున్గున్యా వంటి అంటువ్యాధులు ప్రబలకుండా నివారించేందుకు జైనూర్ మండలంలోని జంగం గ్రామంలో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో గురువారం బ్లీచింగ్ పౌడర్ చల్లింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధులు, కాలువలు, మురుగు ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లి పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో దోమల నివారణ, క్రిముల నిర్మూలనతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటూ పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉప సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా గ్రామపంచాయతీ చెత్త సేకరణకు సహకరించాలని కోరారు. అలాగే ఇళ్ల చుట్టూ నిల్వ నీరు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సూచించారు.

## సర్వేయర్లు నిబద్ధతతో పనిచేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో భూ సమస్యల పరిష్కారానికి వేగం పెంచడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన భూ సర్వే సేవలు అందించేందుకు లైసెన్స్డ్ సర్వేయర్లు నిబద్ధతతో పనిచేయాలని జిలాల అదనపు కలెక్టర్ ఆర్.ఎస్.చిత్రు సూచించారు. భూ సర్వేలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి వివాదాలకు తావులేకుండా ఖచ్చితత్వంతో నిర్వహించాలని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సర్వే, సెటిల్మెంట్ అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న అభ్యర్థులకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రభాకర్ తో కలిసి రెండేళ్ల కాలపరిమితి గల అధికారిక ల్యాండ్ సర్వే లైసెన్స్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భూ సర్వేయర్లు ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా నిష్పాక్షికంగా, పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా సర్వేలు నిర్వహించడంతో పాటు భూ సరిహద్దు వివాదాల పరిష్కారంలో సమర్థవంతంగా వ్యవహరించాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 13 మంది అభ్యర్థులకు ల్యాండ్ సర్వే లైసెన్సులు మంజూరు కాగా, వారిలో నేరడిగొండ మండలం నుంచి ముగ్గురు ఎంపిక కావడం విశేషం. దర్బాతండాకు చెందిన ఆడే మహిపాల్, నేరడిగొండకు చెందిన ఆడే సాయికిరణ్, బోరిగాం గ్రామానికి చెందిన రాథోడ్ సందీప్, ఉట్నూర్ శివాజీనగర్కు చెందిన పెంట శ్రీనివాస్, గుడిహత్నూర్ మండలం వైజాపూర్కు చెందిన మునేసుల అనూష, నార్నూర్కు చెందిన ముబషీర్ ఖాన్, ఆదిలాబాద్కు చెందిన ఉమర్ ఆలం, మహాలక్ష్మీవాడకు చెందిన సకారపు శుభం, ఇంద్రవెల్లి మండలం వాడ్గాం గ్రామానికి చెందిన పెందూర్ ఓంకార్, దొంగగాం గ్రామానికి చెందిన కోవా భగవాంజీ, ఇచ్చోడ మండలం విద్యారణ్యనగర్ కాలనీకి చెందిన ఘోడ్కే మహేశ్వర్, బజార్హత్నూర్ మండలం కాండ్లి గ్రామానికి చెందిన మడావి శ్రావణ్ కుమార్, తీర్పల్లికి చెందిన జోగు శివసాయి లైసెన్స్ పత్రాలను అందుకున్నారు. లైసెన్సులు అందుకున్న వారు మాట్లాడుతూ పారదర్శకమైన భూ సర్వే సేవలు అందిస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతాయుతంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## విదేశీ ఉద్యోగాల పేరుతో మోసం

**ఇద్దరు నిందితుల రిమాండ్**



**ఉద్యమ కెరటం,ఆదిలాబాద్:** విదేశాలలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఆశ చూపి, బాధితుడి నుంచి విడతలవారీగా రూ.6లక్షలకు పైగా వసూలు చేసి మోసానికి పాల్పడిన ప్రధాన ఏజెంట్ తో పాటు మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్కు తరలించినట్లు ఇంద్రవెల్లి ఎస్సై ఈ.సాయన్న గురువారం విలేకరులకు తెలిపారు. ఇంద్రవెల్లి మండలంలోని హెల్టేకిడి హీరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ సుకేంద్ర విదేశాలలో ఉద్యోగం చేయాలనే ఆశతో జగిత్యాల జిల్లా వాల్గొండకు చెందిన జయదేవ మ్యాన్ పవర్ కన్సల్టెన్సీ ఏజెంట్ అనుపురపు శ్రీనివాస్ గౌడ్ ను సంప్రదించాడు. ఇజ్రాయెల్ దేశానికి వెళ్లడానికి రూ.4లక్షల 30వేల ఖర్చు అవుతుందని శ్రీనివాస్ గౌడ్ తెలపగా, మరో నిందితుడు ఇస్లావత్ ప్రభాకర్, బాధితుడికి పూర్తి నమ్మకం కలిగేలా ప్రోత్సహించాడు. వారిని నమ్మి బాధితుడు విడతలవారీగా నగదు చెల్లించాడు. అయితే నిందితులు డబ్బులు తీసుకుని బాధితుడిని పలుమార్లు తిప్పుతూ మోసానికి పాల్పడ్డారు. అదనంగా ఖర్చవుతాయంటూ నమ్మించి, వివిధ విడతలుగా బాధితుడి వద్ద నుంచి మొత్తం రూ.6లక్షల 51వేల 800 వసూలు చేశారు. రెండుసార్లు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి బాధితుడిని తీసుకెళ్లినప్పటికీ, సరైన పత్రాలు లేని కారణంగా అతన్ని వెనక్కి పంపించారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పెద్దల సమక్షంలో నిందితులను నిలదీయగా, వారు రూ.6లక్షల 40వేలు తిరిగి ఇస్తామని ఒప్పుకున్నారు. అయితే డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో బాధితుడు ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు స్పందించిన ఇంద్రవెల్లి ఎస్సై నిందితులను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చగా, జడ్జి వారికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు. విదేశాలలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నకిలీ ప్రకటనలు చేసే అనధికార ఏజెంట్లను నమ్మవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

# ఒక వ్యక్తి కి ఒకే ఓటు

- **ఎన్యుమరేషన్ ఫారాలు వెంటనే బీఎల్ఓలకు అందజేయాలి**
- **జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలో రెండు చోట్ల ఓటు హక్కు నమోదైన వారు వెంటనే ఒకే ప్రాంతంలో ఓటు కొనసాగించేలా నిర్ణయం తీసుకుని, మరో ప్రాంతంలోని ఓటును తొలగించేందుకు అవసరమైన ఎన్యుమరేషన్ ఫారాలను రెండు, మూడు రోజుల్లోగా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ అంశాలపై గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒక వ్యక్తికి ఒకేచోట ఓటు హక్కు ఉండాలని, రెండు చోట్ల ఓటు కొనసాగించడం ఎన్నికల చట్టానికి విరుద్ధమని స్పష్టం చేశారు. అర్బన్, లేనియెడల గ్రామీణ ప్రాంతంలో ఎక్కడ ఓటు కొనసాగించాలనుకుంటున్నారో సంబంధిత ఓటర్లు వెంటనే నిర్ణయం తీసుకోవాలని, ఈ అంశంపై రాజకీయ పార్టీలు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. గత ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం జిల్లాలో ఓటరు జాబితాలో ఉన్న లోపాలు గణనీయంగా తగ్గాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా సమస్యలు లేవని, మావల, ఆదిలాబాద్ అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే కొన్ని స్వల్ప వ్యత్యాసాలు గుర్తించినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణలో భాగంగా 2025 ఓటరు జాబితా ప్రకారం 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న కేంద్రాలను మాత్రమే పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రొఫార్మాలను ఇప్పటికే రాజకీయ పార్టీలకు అందజేశామని చెప్పారు. మరణించిన, చిరునామా మారిన ఓట్ల తొలగింపు అనంతరం మిగిలే తుది ఓటర్ల సంఖ్య ఆధారంగా అవసరమైన చోట్ల మాత్రమే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడతామని వివరించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణలో ఎన్యుమరేషన్ ప్రక్రియను వేగవంతం చేశామని, గుర్తించిన వ్యత్యాసాలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణలో నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సూచనలు, సందేహాలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్ చిత్రు, ఆర్డీఓ జగదీశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకురాలు నలందప్రియ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రాకేష్, బండి దత్తాత్రేయ, గుడిపల్లి నగేష్, మహమ్మద్ జకరియా, దీపక్, ఆకుల రాము తదితరులు పాల్గొన్నారు.

## లాఠీచార్జికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలి

- **మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్రావు**
- **జైనూర్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా**

**ఉద్యమ కెరటం, జైనూర్:** ఢిల్లీలో విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజీనామా చేయాలని జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్రావు డిమాండ్ చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు గురువారం జైనూర్ మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ షేక్ రషీద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పాల్గొని మాట్లాడారు. నీట్ పరీక్ష ప్రశ్నపత్రం లీకేజీతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ వైఫల్యం బయటపడిందన్నారు. దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన పరీక్షను పారదర్శకంగా నిర్వహించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రశ్నపత్రం లీకేజీ కారణంగా పలువురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, వారి కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. దేశ వ్యాప్తంగా నీట్ పరీక్షకు లక్షలాది మంది విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీపై దర్యాప్తు సంస్థలు సేకరించిన వివరాలు ప్రభుత్వ వైఫల్యాన్ని స్పష్టం చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థులు కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేపడితే వారిపై లాఠీచార్జి చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చిర్లే లక్ష్మణ్ యాదవ్, సర్పంచులు మాడావి మనోహర్, రాథోడ్ రాందాస్, జాదవ్ విఠల్, సింధు నగేష్, పంద్రా కౌసల్య, షేక్ ఆత్రం భుజంగరావు, జంగం ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, జిల్లా నాయకులు పెందూర్ ప్రకాష్, గోపీచంద్, మాజీ కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్, నాయకులు మెస్రం అంబాజీ, అజ్జులాల, హైమద్, అబ్బు, వసీం, హైదర్, పెందూర్ లచ్చు, కనక గంగారాం, రహీం మజర్ తదితరులు పాల్గొన్నారు.



## డేటా ఆధారిత పాలనతోనే క్షేత్రస్థాయిలో సుపరిపాలన సాధ్యం

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** సాంకేతిక పరిజ్ఞానం, డేటా విశ్లేషణ, పారదర్శక విధానాలతో ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత సమర్థవంతంగా అందించవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక 'నీతి–తార' సామర్థ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం ముగింపు సమావేశంలో పాల్గొన్నారు. సాధికార జిల్లా అమలు విభాగం మాస్టర్ ట్రైనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో డేటా సేకరణ, డేటా విశ్లేషణ, డిజిటల్ టూల్స్ వినియోగం, సమాచార నిర్వహణ, ప్రభుత్వ పథకాల పర్యవేక్షణ, ఫలితాల ఆధారిత పాలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక పాలన వ్యవస్థలో సాంకేతికత వినియోగం, డేటా ఆధారిత నిర్ణయాలు, ఫలితాల ఆధారిత పరిపాలన అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఖచ్చితమైన సమాచార సేకరణ, విశ్లేషణ, నిరంతర పర్యవేక్షణ ద్వారా మాత్రమే చివరి లబ్ధిదారునికి సేవలు వేగంగా, పారదర్శకంగా చేరుతాయని తెలిపారు. ప్రభుత్వ శాఖల అధికారులు డిజిటల్ సాంకేతిక సాధనాలను సమర్థవంతంగా వినియోగిస్తూ క్షేత్రస్థాయిలో సమస్యలను శాస్త్రీయంగా గుర్తించి, వాటికి సత్వర పరిష్కారాలు అందించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఇలాంటి శిక్షణలు అధికారుల నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు ప్రజా సేవల నాణ్యతను మెరుగుపర్చడంలో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు. మండల స్థాయిలో ఎదురయ్యే పరిపాలన సవాళ్లను డేటా ఆధారిత విధానాలతో అధిగమించడం, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, పారదర్శకతను పెంచడం, నిర్ణయ ప్రక్రియను వేగవంతం చేయడంలో 'నీతి–తార' వేదిక ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి అధికారి డేటా ఆధారిత పాలనను తమ రోజువారీ విధుల్లో భాగంగా చేసుకుని, సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించడం ద్వారా ప్రజలకు నాణ్యమైన, వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రవీందర్ రాథోడ్, నీతి ఆయోగ్ ప్రోగ్రామ్ అధికారి రాహుల్, బ్లాక్ అధికారుల మాస్టర్ ట్రైనర్ నర్సింగ్ దాస్, వివిధ మండలాల బ్లాక్ స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- **సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**
- **కార్మిక సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం**
- **సత్తుపల్లి పర్యటనలో ఉప ముఖ్యమంత్రి బట్టి**
- **తల్లాడలో దివంగత కాంగ్రెస్ నేత దగ్గుల రఘుపతి రెడ్డికి నివాళులు**

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** అధికారులు సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, సింగరేణి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గురువారం సత్తుపల్లి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని సింగరేణి జేవీఆర్ ఓసీ–2 గని వద్దకు చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం ఉప ముఖ్యమంత్రి సింగరేణి జేవీఆర్ ఓసీ–2 గనిని సందర్శించి అక్కడి పనితీరును పరిశీలించారు. గని అభివృద్ధి, కార్మిక సంక్షేమం, భద్రతా చర్యలపై సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన సింగరేణి ఉద్యోగుల నివాస క్వార్టర్స్ను ప్రారంభించి కార్మికులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తదుపరి సింగరేణి అధికారులు, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొని అభివృద్ధి పనులు, విద్యుత్, మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం తల్లాడ గ్రామానికి చేరుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన తల్లాడ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ దివంగత దగ్గుల రఘుపతి రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, నాయుడు సత్యనారాయణ, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూకల సత్యనారాయణ, సింగరేణి సీఎండీ బుద్ధ ప్రసాద్, జిల్లా కలెక్టర్ దివాకర్, టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ, డీఎఫ్ఓ, సింగరేణి జీఎం శ్రీనివాస్, పీఓ, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, సత్తుపల్లి నియోజకవర్గంలోని మున్సిపల్, ఏఎంసీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, ఐదు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్యూఐ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



## వర్ష వాస్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలి

**ఉద్యమ కెరటం, వాంకిడి:** బౌద్ధ సాంప్రదాయంలో అత్యంత పవిత్రమైన వర్ష వాస్ కార్యక్రమాన్ని కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అశోక్ మహుల్కర్, సమతా సైనిక దళ్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం సందీప్ పిలుపునిచ్చారు. గురువారం వాంకిడి మండల కేంద్రంలోని జేతవన్ బుద్ధ విహార్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 29న ఆషాఢ పౌర్ణమి నుంచి ప్రారంభమయ్యే వర్ష వాస్ కార్యక్రమం ఆశ్వయుజ పౌర్ణమి వరకు మూడు నెలల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఆషాఢ పౌర్ణమి రోజున ధర్మచక్ర ప్రవర్తనం జరిగిన అనంతరం బౌద్ధులకు వస్సా (వర్ష వాస్) ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ కాలంలో బౌద్ధ భిక్షువులు ఒకేచోట నివసిస్తూ ధర్మోపదేశం చేయడం బౌద్ధ సంప్రదాయమని వివరించారు. వర్ష వాస్ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచనలు, అలాగే తథాగత బుద్ధునిపై ఉన్న గ్రంథాలను అధ్యయనం చేసి ధర్మబోధలను ఆచరించాలని సూచించారు. జిల్లాలోని 145 గ్రామాల్లో వర్ష వాస్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల వర్ష వాస్ కమిటీ అధ్యక్షుడు దుర్గం శ్యాంరావు, సమతా సైనిక దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్, మాలి సంఘం నాయకుడు సెండే అన్నాజీ, అంబేద్కర్ సంఘం కోశాధికారి ఉప్రె నాగ్సేన్, నాయకులు రాజేంద్ర ప్రసాద్, అరుణ్, కిరణ్, భీమ్రావు, బుద్ధాజీ తదితరులు పాల్గొన్నారు.



# పంతులమ్మగా మారిన కలెక్టర్ హరిత

## విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించి అభ్యాస సామర్థ్యాల పరిశీలన

## సరైన సమాధానాలు చెప్పిన చిన్నారులకు చాక్లెట్ల బహుమతి

## పరిశుభ్రత, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం ఆసిఫాబాద్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా కొద్దిసేపు పంతులమ్మ అవతారం ఎత్తి విద్యార్థులకు స్వయంగా పాఠాలు బోధించి, వారి అభ్యాస సామర్థ్యాలను పరిశీలించారు. కలెక్టర్ రాకతో పాఠశాలలో సందడి నెలకొంది. విద్యార్థులతో ఆప్యాయంగా ముచ్చటించిన కలెక్టర్ పలు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థినిని తొమ్మిదో ఎక్కం చెప్పాలని కోరగా, ఆమె ఎలాంటి తడబాటు లేకుండా గడగడా చదివి వినిపించింది. చిన్నారి ప్రతిభకు ముగ్ధురాలైన కలెక్టర్ ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులకు చాక్లెట్లు అందించి వారిని ప్రోత్సహించారు. అనంతరం పాఠశాల ఆవరణ, తరగతి గదులు, తాగునీటి సౌకర్యాలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఉపాధ్యాయులు, సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల్లో ప్రాథమిక విద్యా నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేలా బోధనపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల వంటశాలను కూడా తనిఖీ చేసిన కలెక్టర్, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని వంట నిర్వాహకులకు ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తుందని కలెక్టర్ హరిత స్పష్టం చేశారు.








# ఫ్యాట్స్ అంటే ఉపయోగమే.. కానీ అతిగా తీసుకుంటేనే అనారోగ్యకరం..

భారతీయుల ఆహారపు అలవాట్లలో గత కొన్ని దశాబ్దాలుగా గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఒకప్పుడు ఇంట్లో వండిన సాంప్రదాయ వంటకాలే ప్రధాన ఆహారంగా ఉండేవి. ప్రస్తుతం వాటి స్థానంలో చిరు తిండ్లు, ప్యాకెట్ స్నాక్స్, ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలు ఎక్కువగా చోటు దక్కించుకుంటున్నాయి. ఈ మార్పుల కారణంగా ఆహారంలో ఉపయోగించే కొవ్వుల (ఫ్యాట్స్) నాణ్యత, పరిమాణం ఆరోగ్యంపై చూపే ప్రభావం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ముఖ్యంగా ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో మంచి కొవ్వులను ఎంచుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ఫ్యాట్స్ ఆరోగ్యానికి హానికరమైనవే అనే అపోహ చాలా మందిలో ఉంది. అయితే శరీరానికి శక్తిని అందించడం, కణాల నిర్మాణానికి తోడ్పడడం, విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి కొవ్వుల్లో కరిగే విటమిన్లను శరీరం గ్రహించేందుకు సహాయపడటం, ఎక్కువసేపు ఆకలి అవకుండా తృప్తి కలిగించడం వంటి కీలక బాధ్యతలను ఫ్యాట్స్ నిర్వహిస్తాయి. అందువల్ల వాటిని పూర్తిగా మానేయడం కాదు, సరైన రకం, సరైన మోతాదులో తీసుకోవడమే ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

### ఎన్నో రకాలు..

మోనో అన్‌సాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ (ఎంయూఎఫ్ఏ), పాలీ అన్‌సాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ (పీయూఎఫ్ఏ) అధికంగా ఉండే వంటనూనెలు జీవక్రియలకు అనుకూలంగా పనిచేస్తాయి. అనేక వంటనూనెలలో కెరోటినాయిడ్లు, టోకోఫెరాల్స్, టోకోట్రియెనాల్స్, పాలీఫినాల్స్ వంటి సహజ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని, వాపులను తగ్గించడంలో సహాయపడతాయి. ఉదాహరణకు పామ్ ఆయిల్‌లో కెరోటినాయిడ్లు, టోకోట్రియెనాల్స్ సమృద్ధిగా లభిస్తాయి. అదే సమయంలో సాచ్యురేటెడ్ ఫ్యాటీ యాసిడ్స్ కూడా అనేక సంప్రదాయ ఆహారాలు, వంటనూనెలలో సహజంగానే ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన పరిమితుల మేరకు తీసుకుంటే అవి కూడా సమతుల్య ఆహారంలో భాగమే అవుతాయి. ఆహారంలో ఉండే కొవ్వులను ప్రధానంగా కనిపించే కొవ్వులు (Visible Fats), కనిపించని కొవ్వులు (Invisible Fats), పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్‌గా విభజిస్తారు. బియ్యం, ధాన్యాలు, పప్పుధాన్యాలు వంటి ఆహారాల్లో సహజంగా ఉండేవి కనిపించని కొవ్వులు. నెయ్యి, వెన్న, వంటనూనెలు, వనస్పతి వంటి వంట సమయంలో కలిపేవి కనిపించే కొవ్వులు. వీటిని అధికంగా ఉపయోగించడం వల్ల రోజువారీ కొవ్వు వినియోగం తెలియకుండానే పెరిగిపోతుంది. ముఖ్యంగా నూనెలను పదేపదే వేడి చేసి వాడితే హానికరమైన ఆక్సిడేషన్ పదార్థాలు, కొంతమేర ట్రాన్స్ ఫ్యాట్స్ ఏర్పడి ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతాయి.

### ఇవి ప్రమాదకరం..

పాక్షిక హైడ్రోజనేషన్ ప్రక్రియ ద్వారా తయారయ్యే పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్ ను అత్యంత ప్రమాదకరమైనవిగా గుర్తించారు. ఇవి రక్తంలో కొవ్వుల సమతుల్యతను దెబ్బతీసి, రక్తనాళాల పనితీరును ప్రభావితం చేసి గుండె జబ్బులు, మధుమేహం వంటి సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతాయి. వీటివల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనం ఉండదని శాస్త్రీయ అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పామ్ ఆయిల్ వంటి కొన్ని సహజంగా స్థిరంగా ఉండే నూనెలు అనేక ఆహార పదార్థాల తయారీలో పారిశ్రామిక హైడ్రోజనేషన్ అవసరం లేకుండానే ఉపయోగించవచ్చు కాబట్టి వాటిలో పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్ ఉండవు. ఈ ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్ పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్‌ను తగ్గించే దిశగా పలు చర్యలు చేపట్టింది. వంటనూనెలు, ప్రాసెస్డ్ ఆహారాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ పరిమితిని దశలవారీగా తగ్గించడం, తప్పనిసరి లేబెలింగ్ విధించడం, ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రపంచ ఆరోగ్య ప్రమాణాలకు అనుగుణంగా ముందడుగు వేసింది. దీనివల్ల ప్రజారోగ్య పరిరక్షణలో కీలక పురోగతి సాధించింది.

### ట్రాన్స్ ఫ్యాట్స్‌ను తొలగించేందుకు చర్యలు..

ప్రస్తుతం ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (FSSAI) దృష్టి కేవలం హానికరమైన కొవ్వులను తొలగించడంపైనే కాకుండా, దేశవ్యాప్తంగా వినియోగించే వంటనూనెలలో కొవ్వు ఆమ్లాల సమతుల్యతను మెరుగుపరచడంపైనా ఉంది. దీనిలో పారిశ్రామిక ట్రాన్స్ ఫ్యాట్స్‌ను పూర్తిగా తొలగించడం, సమతుల్య ఫ్యాటీ యాసిడ్ కూర్పును ప్రోత్సహించడం, ఆహార పరిశ్రమలలో మార్పులు తీసుకురావడం, వినియోగదారులకు స్పష్టమైన లేబెలింగ్ ద్వారా సరైన సమాచారం అందించడం వంటి అంశాలు ఉన్నాయి. ఆహార పదార్థాలపై సాచ్యురేటెడ్ ఫ్యాట్స్, ట్రాన్స్ ఫ్యాట్స్ వివరాలను తప్పనిసరిగా ప్రకటించడం వల్ల వినియోగదారులు మంచి ఎంపిక చేసుకునే అవకాశం పెరిగింది. భవిష్యత్తులో అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారాలకు ప్యాకెట్ ముందు భాగంలో హెచ్చరిక లేబెల్స్ అమలు చేసే దిశగా కూడా చర్యలు కొనసాగుతున్నాయి.

### ఏ ఒక్క వంట నూనెలో అన్ని పోషకాలు లేవు..

వ్యక్తిగత నియంత్రణ కంటే ఆరోగ్యకరమైన ఆహార వాతావరణాన్ని సృష్టించడమే దీని లక్ష్యం. 2024లో భారత వైద్య పరిశోధనా మండలి (ICMR)-జాతీయ పోషకాహార సంస్థ (NIN) విడుదల చేసిన డైటరీ మార్గదర్శకాల ప్రకారం ఏ ఒక్క వంటనూనె కూడా అన్ని పోషక అవసరాలను పూర్తిగా తీర్చలేదని పేర్కొంది. ఒమేగా-6, ఒమేగా-3 వంటి అవసరమైన ఫ్యాటీ యాసిడ్స్‌ను పొందేందుకు వివిధ రకాల నూనెలను మారుస్తూ ఉపయోగించడం లేదా శాస్త్రీయంగా సమతుల్యంగా మిళితం చేసిన నూనెలను వినియోగించడం ఉత్తమమని సూచించింది. దేశంలో గతంలో ప్రాంతానికో ప్రత్యేక వంటనూనె వినియోగించే సంప్రదాయం ఉండేది. ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో ఆవ నూనె, పశ్చిమ ప్రాంతాల్లో వేరుశెనగ నూనె, దక్షిణ భారతంలో కొబ్బరి నూనె, అలాగే నువ్వుల నూనె, పామ్ ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటి నూనెలు ప్రాంతీయ ఆహార సంస్కృతిలో భాగంగా ఉండేవి. అయితే ఆధునిక జీవనశైలి, ప్రాసెస్డ్ ఆహారాల వినియోగం పెరగడంతో ఈ వైవిధ్యం




తగ్గిపోయింది. వివిధ రకాల నూనెలను సమతుల్యంగా ఉపయోగించడం వల్ల శరీరానికి అవసరమైన ఫ్యాటీ యాసిడ్స్ అందడంతో పాటు జీవక్రియ కూడా మెరుగుపడుతుంది.ఎఆర్‌శీటీఎ

### ఆరోగ్యకరమైన నూనెలు లభించాలి..

ఆరోగ్యకరమైన వంటనూనెలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండటం కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. వీధి ఆహార విక్రేతలు, చిన్న హోటళ్లు, ఆహార తయారీ సంస్థలు, సాధారణ కుటుంబాలు ఆరోగ్యకరమైన నూనెలను వినియోగించాలంటే అవి సరసమైన ధరలో సులభంగా లభించాలి. దీనికోసం వ్యవసాయం, ఆహార పరిశ్రమ, వాణిజ్య విధానాలు, ప్రభుత్వ నియంత్రణ వ్యవస్థలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంటుంది. పిల్లలు, యువతలో అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారాల వినియోగం పెరగడం మరో ఆందోళనకర అంశంగా మారింది. అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు కలిగిన ఆహారాలు చిన్న వయసులోనే వారి రుచి అలవాట్లను ప్రభావితం చేస్తాయి. అందువల్ల స్పష్టమైన లేబెలింగ్, ప్రకటనల నియంత్రణ, పాఠశాల స్థాయిలో పోషకాహార మార్గదర్శకాలు వంటి చర్యలు భవిష్యత్ తరాల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆహారంలో కొవ్వుల నాణ్యత వ్యక్తిగత అలవాట్లకే పరిమితమైన విషయం కాదు. ప్రజలకు అందుబాటులో ఉండే ఆహార వ్యవస్థపై కూడా అది ఆధారపడి ఉంటుంది. ఆరోగ్యకరమైన నూనెలు సులభంగా లభించేలా, స్పష్టమైన సమాచారం ఉండేలా, అందరికీ కొనుగోలు చేయగలిగే ధరలో అందుబాటులో ఉంటే ప్రజలు సహజంగానే మెరుగైన ఆహార ఎంపికలు చేసుకునే అవకాశం పెరుగుతుంది. హానికరమైన కొవ్వులను తగ్గించడంతో పాటు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన కొవ్వులను ప్రోత్సహించడం ద్వారా దేశం ఆరోగ్యకరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

# జింబాబ్వేలో గెలుపే లక్ష్యం..

## నేడు భారత్ తొలి టీ20




**హరారే, జూలై 23 (ఉద్యమ కెరటం):** ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో నిరాశలో ఉన్న భారత జట్టు జింబాబ్వే పర్యటనతో కొత్త ఆరంభానికి సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో భాగంగా నేడు హరారేలో జరిగే తొలి మ్యాచ్‌లో విజయం సాధించి మళ్లీ గెలుపు బాట పట్టాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన కొద్ది రోజుల వ్యవధిలోనే మరో అంతర్జాతీయ సిరీస్ ఆడుతున్న భారత జట్టుకు ఇది కీలక పరీక్షగా మారింది. యువ ఆటగాళ్లతో కూడిన జట్టుకు శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహిస్తుండగా, గత సిరీస్‌లో జరిగిన తప్పిదాలను సరిదిద్దుకుని మెరుగైన ప్రదర్శన చేయాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ఇంగ్లాండ్ పర్యటనలో పాల్గొన్న కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు పలువురు ఆటగాళ్లు నేరుగా హరారే చేరుకోగా, మిగతా సభ్యులు తాత్కాలిక ప్రధాన కోచ్ వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో భారత్ నుంచి జింబాబ్వేకు బయలుదేరారు. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి మ్యాచ్ నేడు సాయంత్రం 4.30 గంటలకు, రెండో మ్యాచ్ జులై 25న, మూడో మ్యాచ్ జులై 26న అదే సమయానికి జరగనున్నాయి. ఈ మూడు మ్యాచ్‌లకూ హరారే స్పోర్ట్స్ క్లబ్ ఆతిథ్యం ఇస్తోంది. ఈ సిరీస్‌కు సంబంధించి అభిమానులకు ముఖ్యమైన విషయం ఏమిటంటే, సాధారణ క్రీడా ప్రసార ఛానళ్లలో మ్యాచ్‌లు ప్రత్యక్ష ప్రసారం కావు. ఈ మ్యాచ్‌లను ఫ్యాన్‌కోడ్ వేదికలో మాత్రమే ప్రత్యక్ష ప్రసారంగా వీక్షించవచ్చు. ఇందుకోసం మ్యాచ్ పాస్ లేదా చందా తీసుకోవాల్సి ఉంటుంది. టెలివిజన్‌లో మాత్రం యునైట్–8 స్పోర్ట్స్ ఛానల్‌తో పాటు దూరదర్శన్ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం అందుబాటులో ఉంటుంది. వరుస పరాజయాల తర్వాత ఈ సిరీస్‌లో విజయం సాధించి ఆత్మవిశ్వాసాన్ని తిరిగి పొందాలని భారత జట్టు భావిస్తోంది. మరోవైపు యువ ఆటగాళ్లు తమ ప్రతిభను ఎలా చాటుకుంటారన్న అంశంపై క్రికెట్ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. భారత్ జట్టు: శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, సూర్యాంశ్ షెడ్జ్, రింకూ సింగ్, హర్ష్ దూబే, వరుణ్ చక్రవర్తి, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అర్ష్‌దీప్ సింగ్, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్.



## చైనా ఓపెన్‌లో ముగిసిన
# సింధు పోరాటం

**చాంగ్‌జౌ, జూలై 23 (ఉద్యమ కెరటం):** చైనా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ప్రీక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. గురువారం జరిగిన ఉత్కంఠభరిత పోరులో ప్రపంచ నాలుగో ర్యాంకర్ చెన్ యుఫేయి చేతిలో సింధు 16–21, 22–20, 21–18 తేడాతో ఓటమి పాలైంది. గంటా 29 నిమిషాల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో చివరి వరకు ఇరువురు షట్లర్లు హోరాహోరీగా పోటీపడ్డారు.

ఇటీవల జపాన్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకుని మంచి జోష్‌లో ఉన్న సింధు తొలి గేమ్‌లో అద్భుత ప్రదర్శనతో ఆధిక్యం సాధించింది. రెండో గేమ్‌లో కూడా విజయం అంచుల వరకు వెళ్లిన ఆమెకు వచ్చిన నాలుగు మ్యాచ్ పాయింట్లను సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఆ అవకాశాన్ని వినియోగించుకున్న చెన్ యుఫేయి రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. మూడో గేమ్‌లో కూడా ఇరువురు షట్లర్లు నువ్వా–నేనా అన్నట్లు పోరాడారు. అయితే చివరి దశలో కీలక పాయింట్లు సాధించిన చెన్ యుఫేయి మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం చెలాయించి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో గతవారం జపాన్ ఓపెన్ సెమీఫైనల్లో ఎదురైన ఓటమికి ఆమె ప్రతీకారం తీర్చుకున్నట్లైంది. ఈ ఓటమితో చైనా ఓపెన్‌లో పీవీ సింధు ప్రస్థానం ముగిసింది. అయినప్పటికీ మ్యాచ్ మొత్తం అత్యున్నత స్థాయి ర్యాలీలు, ఉత్కంఠభరిత పోరుతో సాగి బ్యాడ్మింటన్ అభిమానులను అలరించింది.

# లవ్లీనాకు పతకం ఖాయం

## భారత్‌కు తొలి విజయం



**గ్లాస్‌గోవ్, జులై 23 :** కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్‌కు తొలి పతకం దాదాపు ఖాయమైంది. మహిళల 75 కిలోల బాక్సింగ్ విభాగంలో భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గోహెయిన్ సెమీఫైనల్‌కు చేరడంతో కనీసం కాంస్య పతకం ఆమె ఖాతాలో పడనుంది. క్వార్టర్ ఫైనల్లో ప్రత్యర్థి లేకపోవడంతో లవ్లీనాకు బై లభించింది. దీంతో ఆమె నేరుగా సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. జులై 31న జరిగే సెమీఫైనల్‌లో తాఫకితో లవ్లీనా తలపడనుంది. ఒకవేళ ఆ పోరులో ఓడినా కూడా బాక్సింగ్ నిబంధనల ప్రకారం ఆమెకు కాంస్య పతకం ఖాయం కానుంది. కామన్‌వెల్త్ క్రీడల ప్రారంభ వేడుకలు జరగకముందే భారత్‌కు పతకం ఖరారు కావడం విశేషం. రింగ్‌లో తొలి పోరు ఆడకముందే లవ్లీనా పోడియంపై చోటు దక్కించుకోవడం భారత బాక్సింగ్‌కు మరో గర్వకారణంగా నిలిచింది. ఈసారి కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ తరఫున మొత్తం 124 మంది అథ్లెట్లు వివిధ విభాగాల్లో పోటీ పడుతున్నారు. 2022 కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన నేపథ్యంలో, ఈసారి కూడా మరిన్ని పతకాలు సాధించాలని భారత జట్టు లక్ష్యంగా పెట్టుకుంది.



# దోప్ పరీక్షలో అరుణ్ కుమార్‌కు షాక్

**గ్లాస్‌గోవ్, జులై 23 :** కామన్‌వెల్త్ క్రీడలు ప్రారంభానికి ముందే భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. జూడో క్రీడాకారుడు అరుణ్ కుమార్ డోప్ పరీక్షలో విఫలమైన నేపథ్యంలో అతడిని కామన్‌వెల్త్ క్రీడల నుంచి అనర్హుడిగా ప్రకటించారు. పురుషుల 73 కిలోల జూడో విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాల్సిన అరుణ్ కుమార్ నమూనాలో నిషేధిత ఉత్ప్రేరక పదార్థాల ఆనవాళ్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ బుధవారం అతడికి నోటీసులు జారీ చేసింది. అంతర్జాతీయ జూడో సమాఖ్య అరుణ్ కుమార్ నమూనాలో ప్రతికూల విశ్లేషణ ఫలితం నమోదైనట్లు కామన్‌వెల్త్ క్రీడల నిర్వాహకులతో పాటు భారత ఒలింపిక్ సంఘానికి సమాచారం అందించింది. అనంతరం 2026 కామన్‌వెల్త్ క్రీడల అధికారిక క్రీడాకారుల జాబితా నుంచి అతడి పేరును తొలగించారు. అరుణ్ కుమార్ స్థానంలో మరో జూడో క్రీడాకారుడిని ఎంపిక చేసే అవకాశం లేదని భారత జూడో సమాఖ్య అధ్యక్షుడు ముకేశ్ కుమార్ స్పష్టం చేశారు. దీంతో పురుషుల 73 కిలోల విభాగంలో భారత్‌కు ఒక అవకాశం కోల్పోయినట్లైంది.

# గుకేశ్‌కు మరో షాక్..

## ప్రణేష్ సంచలన విజయం

**చెన్నై, జులై 23 :** చెన్నై గ్రాండ్ మాస్టర్స్ చెస్ టోర్నీలో యువ గ్రాండ్‌మాస్టర్ ఎం. ప్రణేష్ సంచలన విజయం నమోదు చేశాడు. ప్రపంచ ఛాంపియన్ డి. గుకేశ్‌పై 39 ఎత్తుల్లో గెలిచి తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్నాడు. మరోవైపు గుకేశ్ ఈ టోర్నీలో వరుసగా రెండో ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అంతకుముందు అర్జున్ ఎరిగైసి చేతిలో ఓటమిపాలైన గుకేశ్, ప్రణేష్‌తో జరిగిన మ్యాచ్‌లోనూ అనుకూల స్థితిని విజయంగా






మలచుకోలేకపోయాడు. కారో–కాన్ డిఫెన్స్‌లో తెల్ల పావులతో ఆడిన ప్రణేష్ ప్రారంభంలో ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ, లాంగ్ కాస్లింగ్‌తో ఆటను సంక్లిష్టంగా మార్చి ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచాడు. ఒక దశలో గుకేశ్ బలమైన ఎత్తుగడలతో ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ, డీ3 వద్ద లభించిన కీలక అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. అనంతరం రూక్‌ను బీ5కు కదిపిన ప్రణేష్ క్రమంగా ఆటపై పట్టు సాధించి గుకేశ్‌ను రక్షణాత్మక స్థితిలోకి నెట్టాడు. చివరికి ప్రణేష్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటూ 39వ ఎత్తులో విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో చెన్నై గ్రాండ్ మాస్టర్స్ టోర్నీలో అతను సంచలనం సృష్టించగా, వరుస పరాజయాలతో గుకేశ్ టైటిల్ అవకాశాలను క్లిష్టం చేసుకున్నాడు.

# ఫైనల్ ఓటమి తర్వాత అర్జెంటీనాపై విమర్శలు


**మాడ్రిడ్, జులై 23 :** ఫిఫా ప్రపంచకప్–2026 ఫైనల్‌లో స్పెయిన్ చేతిలో అర్జెంటీనా ఓటమి పాలైనట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆ జట్టుపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. టోర్నీ మొత్తం అర్జెంటీనా ఆటతీరు, ఆటగాళ్ల ప్రవర్తనపై పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. టోర్నీ జరుగుతున్న సమయంలోనే ఫిఫా అర్జెంటీనాకు అనుకూలంగా వ్యవహరిస్తోందంటూ కొందరు అభిమానులు ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో అర్జెంటీనాను ప్రపంచకప్ నుంచి తప్పించాలంటూ సామాజిక మాధ్యమాల్లో ఒక ఆన్‌లైన్ పిటిషన్ ప్రచారంలోకి వచ్చింది. దీనికి ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున మద్దతు లభించినట్లు పలు కథనాలు పేర్కొన్నాయి. ఫైనల్ అనంతరం అర్జెంటీనా ఆటగాళ్ల ప్రవర్తన కూడా వివాదాస్పదంగా మారినట్లు ప్రచారం జరిగింది. ప్రత్యర్థి ఆటగాళ్లతో వాగ్వాదాలు, ఘర్షణలకు సంబంధించిన ఘటనలు అభిమానులు, క్రీడా విశ్లేషకుల మధ్య చర్చనీయాంశంగా మారాయి. దీంతో టోర్నీ మొత్తం అర్జెంటీనా జట్టు ప్రవర్తనపై విమర్శలు మరింత పెరిగాయి. అయితే, అర్జెంటీనాపై వచ్చిన ఆరోపణలు, పిటిషన్‌లో పేర్కొన్న అంశాలపై ఫిఫా నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. అలాగే జట్టుపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ప్రకటించలేదు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న పలు గణాంకాలు, పిటిషన్‌కు సంబంధించిన వివరాలకు స్వతంత్ర ధృవీకరణ కూడా అందుబాటులో లేదు.

# కామన్వెల్త్‌లో 9 క్రీడలకు కోత

## భారత్‌కు భారీ ఎదురుదెబ్బ




**గ్లాస్‌గోవ్, జులై 23 :** 2026 కామన్వెల్త్ క్రీడల నిర్వహణలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. క్రికెట్, హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్ సహా మొత్తం తొమ్మిది క్రీడలను ఈసారి పోటీల నుంచి తొలగించారు. తక్కువ బడ్జెట్‌తో పోటీలను నిర్వహించాలనే ఉద్దేశంతో నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి 2026 కామన్వెల్త్ క్రీడలకు ఆస్ట్రేలియాలోని విక్టోరియా రాష్ట్రం ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే పెరిగిన వ్యయభారం కారణంగా ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ నుంచి తప్పుకోవడంతో స్కాట్లాండ్‌లోని గ్లాస్‌గోవ్ నగరం ఆతిథ్య బాధ్యతలు స్వీకరించింది. పరిమిత సమయం, తక్కువ నిధుల నేపథ్యంలో పోటీల సంఖ్యను గతంలో ఉన్న 19 క్రీడల నుంచి 10 క్రీడలకు కుదించారు. ప్రత్యేక వేదికలు, క్రీడాకారుల గ్రామాల నిర్వహణ ఖర్చులను తగ్గించడమే ఈ నిర్ణయానికి ప్రధాన కారణంగా నిర్వాహకులు తెలిపారు. కామన్వెల్త్ క్రీడల చరిత్రలో 1998లో మలేషియాలో జరిగిన పోటీల్లో పురుషుల క్రికెట్‌ను తొలిసారిగా ప్రవేశపెట్టారు. అనంతరం 24 ఏళ్ల విరామం తర్వాత 2022 బర్మింగ్‌హామ్ క్రీడల్లో మహిళల టీ20 క్రికెట్‌ను తిరిగి చేర్చారు. ఆ పోటీల్లో భారత మహిళల జట్టు రజత పతకాన్ని సొంతం చేసుకుంది. క్రికెట్‌తో పాటు హాకీ, బ్యాడ్మింటన్, రెజ్లింగ్ వంటి క్రీడల్లో భారత్‌కు పతకాల అవకాశాలు ఎక్కువగా ఉండేవి. ఇప్పుడు ఈ క్రీడలన్నీ తొలగించడంతో 2026 కామన్వెల్త్ క్రీడల్లో భారత పతకాల సంఖ్యపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




# నీట్‌పై విద్యార్థుల ఆక్రందన సబబే

## దానికి సానుకూలంగా స్పందించాల్సిందే

## ప్రభుత్వ విధానాలను తూర్పారా బట్టిన కమల్ హాసన్

**న్యూఢిల్లీ, జూలై 23:** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పరీక్షకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన నిరసనలకు ప్రముఖ నటుడు, రాజ్యసభ ఎంపీ కమల్ హాసన్ మద్దతు ప్రకటించారు. విద్యార్థుల ఆందోళనలపై స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. 'ఒక బిడ్డ ఏడ్చినప్పుడే మనం వినాల్సింది. కానీ ఎంతోమంది పిల్లలు ప్రాణాలు కోల్పోయే వరకు వేచి చూశాం. నేర్చుకోవడం స్థానంలో శిక్షణ, జిజ్ఞాస స్థానంలో ఆందోళన, ప్రతిభ స్థానంలో నేర ప్రవృత్తి చోటుచేసుకుంది. ఇది కుళ్లిపోయిన వ్యవస్థ' అని వ్యాఖ్యానించారు. విద్యార్థులకు సమాధానాలు, అవకాశాలు అందించాల్సిన వ్యవస్థ వారిని అడ్డంకులు, ఒత్తిళ్లు, నిరాశల వైపు నెట్టివేస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 'పిల్లలకు సమాధానాల బదులుగా అడ్డంకులు, లాఠీలు ఎదురైతే అది ఒక దేశ వైఫల్యానికి సంకేతం' అని పేర్కొన్నారు. సామాజిక కార్యకర్త, విద్యా సంస్కరణల కోసం పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌ను ఉద్దేశించి కమల్ హాసన్ ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. 'దేశానికి రాబోయే ప్రయాణంలో మీ అవసరం ఉంది. దయచేసి మీ నిరాహార దీక్షను విరమించండి' అంటూ కోరారు. అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన భావోద్వేగ సందేశం ఇచ్చారు. 'భారతదేశ బిడ్డలారా.. మీరే మాలో ఉత్తములు. మీరు మీ కర్తవ్యాన్ని నెరవేర్చారు. ఇప్పుడు దేశం మీకు తన కర్తవ్యాన్ని నెరవేర్చాల్సిన సమయం వచ్చింది. మీ కలలు ఎల్లప్పుడూ మా వైఫల్యాల కన్నా ఉన్నతంగా నిలవాలి' అని పేర్కొన్నారు. జంతర్ మంతర్ వద్ద కొనసాగుతున్న నీట్ వ్యతిరేక నిరసనలకు రాజకీయ, సామాజిక వర్గాల నుంచి మద్దతు పెరుగుతున్న నేపథ్యంలో కమల్ హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు, విద్యావిధానం, ప్రవేశ పరీక్షలపై జాతీయ స్థాయిలో చర్చ మళ్లీ వేడెక్కుతోంది.

# దేశ సమస్యలపై ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

## ఎప్పటికప్పుడు స్పందించడం అలవర్చుకోవాలి

## ఎక్స్ వేదికగా నటి మంచు లక్ష్మి పోస్ట్



**హైదరాబాద్, జూలై 23:** దేశంలో జరుగుతున్న సామాజిక, ప్రజా సమస్యలపై ప్రతి పౌరుడు బాధ్యతగా స్పందించాలని ప్రముఖ నటి, నిర్మాత మంచు లక్ష్మి పిలుపునిచ్చారు. మనకెందుకులే అనే నిర్లక్ష్య ధోరణిని విడిచిపెట్టి, సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై ప్రతి ఒక్కరూ తమ స్వరం వినిపించాలని ఆమె కోరారు. తాజాగా రాజ్యాంగ హక్కుల కోసం ఆందోళన చేస్తున్న ప్రముఖ పర్యావరణవేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్కు మద్దతుగా మంచు లక్ష్మి సోషల్ మీడియాలో ఓ వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో దేశంలో జరుగుతున్న పరిణామాలపై తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రజల్లో సామాజిక బాధ్యత పెరగాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. దేశంలో కీలకమైన సమస్యలు ఎదురవుతున్నప్పుడు చాలామంది వాటిని తమకు సంబంధం లేని విషయాలుగా భావించి మౌనం పాటిస్తున్నారని అన్నారు. కానీ అలాంటి వైఖరి ప్రజాస్వామ్యానికి మంచిది కాదని ఆమె అభిప్రాయ పడ్డారు. ప్రతి ఒక్కరూ ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొనాల్సిన అవసరం లేకపోయినా, కనీసం సమస్యలపై మాట్లాడటం, చర్చించడం, సోషల్ మీడియా ద్వారా స్పందించడం కూడా ఒక బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యమని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ వంటి వ్యక్తులు ప్రజల హక్కుల కోసం చేస్తున్న పోరాటానికి న్యాయం జరగాలని తాను కోరుకుంటున్నానని మంచు లక్ష్మి తెలిపారు. ఆయన ఆశయాలను తాను గౌరవిస్తున్నానని, సమాజ ప్రయోజనాల కోసం పోరాడే వ్యక్తులకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. అలాగే రాజకీయాలపై విమర్శలు చేయడం కంటే, దేశ భవిష్యత్తు, రాబోయే తరాల సంక్షేమం కోసం బాధ్యతతో స్పందించడం ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. దేశంలో జరుగుతున్న పరిణామాలను చూస్తూ నిశ్శబ్దంగా ఉండటం తనను బాధిస్తోందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలంతా చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మంచు లక్ష్మి విడుదల చేసిన ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమె సందేశానికి పలువురు నెటిజన్లు మద్దతు తెలుపుతూ, ప్రజా సమస్యలపై అవగాహన పెంచే ప్రయత్నాలను అభినందిస్తున్నారు. సమాజంలో జరుగుతున్న అంశాలపై స్పందించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆమె చేసిన పిలుపు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

## రణ్‌వీర్ ప్రళయ్‌లో

# కళ్యాణి ప్రియదర్శన్?



బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటిస్తున్న భారీ బ్జడెట్ చిత్రం 'ప్రళయ్'పై ఇప్పటికే సినీ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజా వార్త ఇప్పుడు మరింత ఆసక్తిని పెంచుతోంది. ఈ చిత్రంలో హీరోయి-న్‌గా దక్షిణాది నటి కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికైనట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కళ్యాణి ప్రియదర్శన్ ఇప్పటికే తెలుగు, తమిళం, మలయాళ భాషల్లో పలు విజయవంతమైన చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. సహజమైన నటన, అందంతో యువతలో ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పరచుకున్న ఆమెకు ఇప్పుడు బాలీవుడ్‌లో భారీ అవకాశం దక్కబోతుందనే వార్త చర్చనీయాంశంగా మారింది. రణ్‌వీర్ సింగ్ వంటి స్టార్ హీరో సరసన నటించే అవకాశం రావడం ఆమె కెరీర్‌లో కీలక మలుపుగా భావిస్తున్నారు. రణ్‌వీర్ సింగ్ తన ఎనర్జిటిక్ స్క్రీన్ ప్రెజెన్స్, విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్నారు. అలాంటి హీరోతో కళ్యాణి జోడీ కట్టడం సినిమాపై మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ఎలా ఉంటుందో తెలుసుకోవాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా దక్షిణాది ప్రేక్షకుల్లో కూడా ఈ కాంబినేషన్‌పై చర్చ మొదలైంది. 'ప్రళయ్' చిత్రాన్ని భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. యాక్షన్ సీక్వెన్సులతో పాటు భావోద్వేగాలకు కూడా ప్రాధాన్యత ఇచ్చే కథగా రూపొందుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి సాంకేతిక ప్రమాణాలతో సినిమాను రూపొందించేందుకు మేకర్స్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కళ్యాణి ప్రియదర్శన్ ఎంపికపై అధికారిక ప్రకటన రాకపోయినా, త్వరలోనే చిత్రబృందం పూర్తి తారాగణాన్ని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం.



# బోల్డ్ సన్నివేశాల్లో నటించలేను: కాజల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ మరోసారి తన వ్యక్తిగత అభిప్రాయాలను స్పష్టంగా వెల్లడించారు. సినిమాల్లో బికినీ, బోల్డ్ సన్నివేశాలు, రొమాంటిక్ సీన్స్‌పై ఇటీవల జరుగుతున్న చర్చల మధ్య ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ముఖ్యంగా పెళ్లి తర్వాత హీరోయిన్లు గ్లామర్ పాత్రలు చేయడంపై వస్తున్న విమర్శల నేపథ్యంలో కాజల్ స్పందించిన తీరు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం 'ది ఇండియా స్టోరీ' సినిమా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న కాజల్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, కెరీర్ ప్రారంభం నుంచే తాను బికినీ లేదా అతిగా బోల్డ్ సన్నివేశాల్లో నటించడానికి ఆసక్తి చూపలేదని తెలిపారు. అలాంటి పాత్రలు చేయడం తనకు వ్యక్తిగతంగా అసౌకర్యంగా అనిపిస్తుందని, అందుకే ఎన్నో భారీ చిత్రాలను కూడా వదులుకున్నానని వెల్లడించారు. సినిమాల కోసం లేదా డబ్బు కోసం నా వ్యక్తిత్వాన్ని మార్చుకోలేను. నాకు కొన్ని విలువలు, సిద్ధాంతాలు ఉన్నాయి. వాటిని నేను ఎప్పుడూ రాజీ పడను. తెరపై బోల్డ్ సీన్స్ చేయాల్సిన అవసరం ఉందని నేను భావించను అని కాజల్ స్పష్టం చేశారు. తల్లి అయిన తర్వాత తన ఆలోచనల్లో మరింత మార్పు వచ్చిందని కూడా ఆమె తెలిపారు. తన కుమారుడు నీల్ కిచ్లూ పెద్దయ్యాక తన సినిమాలు చూసి గర్వపడాలని కోరుకుంటానని, తన నటించిన పాత్రల గురించి భవిష్యత్తులో తన బిడ్డకు వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రాకూడదనే ఉద్దేశంతో కథలు, పాత్రల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. నా కొడుకు నా సినిమాలు చూసి గర్వపడాలి. అతను అసౌకర్యంగా ఫీలయ్యే పాత్రలు నేను చేయాలనుకోవడం లేదు. అందుకే ఇప్పుడు ప్రతి కథను చాలా ఆలోచించి ఎంపిక చేసుకుంటున్నాను అని ఆమె పేర్కొన్నారు. ఇదిలా ఉంటే, ఇటీవల 'టాక్సిక్' సినిమాలో యశ్‌తో కలిసి నటించిన కియారా అద్వానీ రొమాంటిక్ సన్నివేశాలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరిగిన నేపథ్యంలో కాజల్ పాత వ్యాఖ్యలు మళ్లీ వైరల్ అవుతున్నాయి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**